PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 130 | విజయవాడ, ఆదివారం 11 డిసెంబర్ 2022 | 6+8 పేజీలు + స్నేహ వెల : 7. 00

Vol No | Vijayawada, Sunday 11 December 2022 | Rs

పప్పుల చిట్టీల పేరుతో టోకరా

- రూ. కోటితో పరార్
- బాధితుల ఆందోళన

లోపలి పేజీలో..

తిరుపతి జిల్లా దొరవారిసత్రం గ్రామంలో నిలిచిపోయిన వర్షపు నీటిలో రైతుల ఇబ్బందులు

వర్ష బీభత్సం

- ఆరు జిల్లాల్లో భారీ వర్షాలు -తిరుపతి అతలాకుతలం
- 30 చోట్ల 50మి.మీ కంటే అధికం
- సముద్రంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులు
- సహాయచర్యలు చేపట్టండి : సిఎం ఆదేశం
- తమిళనాడులో నలుగురు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

మాండూస్ తుపాన్ రాష్ట్రంలోని ఆరు జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిశాయి. శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఈ జిల్లాల్లోని 32 ప్రాంతాల్లో 50 మిల్లీమీటర్లకంటే అధిక వర్షపాతం నమోదైంది. రాత్రి పది గంటల ప్రాంతంలో కూడా ఈ జిల్లాలతో పాటు, మరికొన్ని ఇతర జిల్లాల్లోనూ వర్షం కురుస్తూనేఉంది. బాపట్ల జిల్లా, చీరాల వాడరేవుకు చెందిన ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లి సముద్రంలో చిక్కుకున్నారు. వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. శనివారం తెల్లవారు జామున తమిళనాడులోని చెన్నై సమీపాన ఉన్న మాముల్లాపురం (మహాబలిపురం) వద్ద తీరం దాటిన తుపాన్ ఆ తరువాత బలహీన పడి తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది మరింత బలహీనపడుతుందని, అయితే, దీని ప్రభావంతో ఆదివారం నాడుకూడా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాన్ తీరం దాటే సమయంలో కురిసిన భారీ వర్షధాటికి తమిళనాడులో బీభత్స పరిస్థితులు నెలకొన్నాయి. నలుగురు మృతి చెందినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు 100 పశువులు మరణించాయి. 200 ఇళ్లు నేలకూలాయి. తమిళనాడులో నష్టతీవ్రత మరింత

తిరుపతి జిల్లా రేణుగుంటలో నేలకొరిగిన అరటి చెట్లు

సముద్రంలో చిక్కుకున్న వాడరేవు మత్స్యకారులు (వార్త లోపల పేజీలో)

ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. సహాయచర్యలు తక్షణమే తీసుకున్నందున మరణాల సంఖ్యను నివారించగలిగామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పారు. మరోవైపు శనివారం ఉదయం సమీక్షా సమావేశం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధిత ప్రజలను ఆదుకునేందుకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్ష తీవ్రత తగ్గిన తరువాత నష్టాల లెక్కలు తీయాలని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి కూడా తుపాన్ పీడిత జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా అనేక గ్రామాల్లో తీవ్ర నష్టం జరిగినట్లు ఆయన చెప్పారు. శనివారం మధ్యాహ్నానికి 708 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అవసరమైతే మరింతమందిని తరలించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఏ జిల్లాలో ఎంత ...?

శనివారం ఉదయం 8.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు తిరుపతి జిల్లాలో అత్యధికంగా 24 మి.మీ వర్షపాతం నమోదైంది. తిరుపతి పట్టణంలో ఎక్కడ చూసినా వర్షపు నీరే కనిపిస్తోంది. నెల్లూరు జిల్లాలో 23.4, చిత్తూరులో 22, అన్నమయ్య జిల్లాలో 20.5, వైఎస్ఆర్ కడపలో 13.2, ప్రకాశం జిల్లాలో 10.1 మి.మీ వర్షపాతం నమోదైంది.

తిరుపతిలో పొంగుతున్న నదులు..వాగులు

వర్ష ధాటికి తిరుపతిలో నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమైనాయి. స్వర్ణముఖి నదికి పెద్దఎత్తున వరద వచ్చి చేరుతుండటంతో ప్రధాన రహదారిలోని కాజ్‌వేలపైకి నీరు పొంగి ప్రవహిస్తోంది. కేవీబీపురం మండలం కాలంగి, రేణిగుంట రిజర్వాయర్‌లకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు 10 గేట్లను 9 అడుగుల మేర ఎత్తి 15వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఫలితంగా దిగువన ఉన్న పూడికేపురం–రాజుల కండ్రిగ మధ్య కాజ్‌వే కొట్టుకుపోయింది.మల్లిమడుగు రిజర్వాయర్‌లో మూడు గేట్లు ఎత్తివేశారు. కింద ఉన్న వెదల్లాచెరువు గ్రామస్తులను సురక్ష ప్రాంతానికి తరలించారు.వెంకటగిరి నియోజకవర్గంలోని కైవల్య నది పొంగిపొర్లుతోంది,

తిరుమలలో

తిరుమలలోని అన్ని జలాశయాలు గరిష్ఠస్థాయికి చేరుకుంటున్నాయి. పాపవినాశనం, ఆకాశగంగ, శ్రీవారి పాదాలు తీర్థాలకు వెళ్లే మార్గాలను టీటీడీ మూసేసింది. కొండ పై కొన్ని ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. తుపాను కారణంగా శ్రీవారి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నెల్లూరులో నీటమునిగిన నారుమళ్లు

నెల్లూరు జిల్లాలో వేలాది ఎకరాల్లో నారుమళ్లు నీటమునిగాయి. ప్రస్తుతానికైతే ఇబ్బంది లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే నారు పాచిపోయే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. వరికుంటపాడులో విద్యుత్ తీగలు తెగి నాలుగు గొర్రెలు మృతి చెందాయి

కడపలో గోడకూలి ఒకరు మృతి

వర్షాల కారణంగా నానిన గోడ కూలడంతో ఒకరు మృతి చెందారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలోని దర్జిపల్లెలో ఈ మిగతా 5లో



ఇషాన్ వీరవిహారం

- 126 బంతుల్లో డబుల్ సెంచరీ
- క్రిస్‌గేల్ రికార్డు బద్దలు

చిట్టగాంగ్: టీమిండియా యువ ఓపెనర్, వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ బంగ్లాదేశ్‌తో జరిగిన మూడో వన్డేలో ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. పరుగుల వరద పారించి వేగవంతమైన డబుల్ సెంచరీతో పాటు పలు అంతర్జాతీయ రికార్డులు నెలకొల్పాడు. కెరీర్‌లో 10వ వన్డే ఆడుతున్న 24ఏళ్ల ఇషాన్ బంగ్లాపై కేవలం 131 బంతుల్లో 24 ఫోర్లు, 10 సిక్సర్ల సాయంతో 210 పరుగులు చేశాడు. ఇదే క్రమంలో డబుల్ సెంచరీని 126 బంతుల్లోనే పూర్తిచేసి వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్ (138 బంతులు) పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. అలాగే భారత్ తరఫున డబుల్ సెంచరీ కొట్టిన 4వ బ్యాటర్‌గా, అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో 9వ క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు. భారత్ తరఫున నలుగురు బ్యాటర్లు ఆరు ద్విశతకాలు కొట్టడం విశేషం. ఇందులో టీమిండియా సారథి రోహిత్ శర్మ ఏకంగా మూడుసార్లు (264, 209, 208 నాటౌట్) డబుల్ సెంచరీలు చేయగా.. వీరేంద్ర సెహ్వాగ్ (219), సచిన్ టెండూల్కర్ (200 నాటౌట్) డబుల్ సెంచరీ చేశారు. అలాగే న్యూజిలాండ్ బ్యాటర్ మార్టిన్ గప్తిల్ (237 నాటౌట్), విండీస్‌కు చెందిన క్రిస్ గేల్ (215 పరుగులు), పాకిస్తాన్‌కు చెందిన ఫఖర్ జమాన్ 210 (నాటౌట్) అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో డబుల్ సెంచరీలు చేశారు.

స్టీల్‌ప్లాంట్ బ్యాటరీ-5లో పేలుడు

- ముగ్గురు కాంట్రాక్టు కార్మికులకు గాయాలు

లోపలి పేజీలో..

వ్యకాస రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు

పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని మహాసభ డిమాండ్

ప్రజావ్యతిరేక విధానాలపై బహుముఖ పోరు నిర్వహించాలని తీర్మానం

దడాల సుబ్బారావు

వి.వెంకటేశ్వర్లు

మహాసభలో మాట్లాడుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెరిగిన ధరలతో పేదలు, వ్యవసాయ కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని, తక్షణం పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని సంఘం మహాసభ డిమాండ్ చేసింది. ప్రజావ్యతిరేక విధానాలపై బహుముఖ పోరు నిర్వహించాలని తీర్మానించింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో మూడు రోజులపాటు జరిగిన ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలో చివరి రోజు శనివారం 79తో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వి.శివనాగరాణి, ఎ.రవి, ఎం.నాగేశ్వరరావు, వి.నాగరాజు, ఇ.అప్పారావు, కోట కల్యాణ్, జె.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, డి.వెంకన్న, టి.ముత్యాలమ్మ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా కె.నారాయణ, కె.ఆంజనేయులు, ఎం.రాజేష్, కె.లోకనాథం, గంగునాయుడు, పి.శ్రీనివాసులు, ఎం.కృష్ణమూర్తి, ఎం.పెద్దన్న, ఎం.పుల్లయ్య, వి.అన్వేష్ ఎన్నుకోబడ్డారు. కమిటీ సభ్యులుగా 57 ఎన్నికయ్యారు. మహాసభలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ దిశానిర్దేశం చేశారు.

22 తీర్మానాలు ఆమోదం

నవరత్నాల్లో భూపంపిణీ చేర్చి దశ రత్నాలుగా మార్చి పేదలకు భూ పంపిణీ మిగతా 2లో

ధైర్యంగా ఫిర్యాదు చేయండి

- చిన్నారులపై లైంగిక వేధింపులను దాచిపెట్టకండి
- తల్లిదండ్రులకు సిజెఐ డివై చంద్రచూడ్ సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులను ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ అన్నారు. చిన్నారులపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో) అమలు జరుగుతున్న తీరుపై రెండు రోజుల సమావేశాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. యునిసెఫ్‌తో కలిసి సుప్రీంకోర్టు కమిటీ నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ గౌరవం పేరుతో చిన్నారులపై జరిగే లైంగిక నేరాలను తల్లితండ్రులు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారని అన్నారు. చాలా సందర్భాలలో కుటుంబసభ్యులే ఈ తరహా వేధింపులకు పాల్పడుతున్నారని, ఫిర్యాదుకు వెనకాడటానికి ఇది కూడా కారణమని చెప్పారు. ఈ సంస్కృతి మారాలని అన్నారు. లైంగిక సమ్మతికి సంబంధించిన వయో పరిమితి అంశంపై

పార్లమెంటు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి, సుప్రీం కోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ ఎస్. రవీంద్ర భట్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బివి నాగరత్న, కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ, యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫెరీ తదితరులు మాట్లాడారు.

ఉపాధ్యాయ బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- డిసెంబర్ 14 నుంచి దరఖాస్తు

లోపలి పేజీలో..

ఆధార్ అనుసంధానం లేకపోతే

పాన్ కార్డు చెల్లదు

- ఏప్రిల్ నుంచి అమల్లోకి
- ఐటి శాఖ వెల్లడి

న్యూఢిల్లీ : వచ్చే మార్చి 31లోపు ఆధార్ కార్డుతో తప్పనిసరిగా పాన్ కార్డును అనుసంధానం చేసుకోవాలని ఆదాయపు పన్ను శాఖ (ఐటి) తెలిపింది. అనుసంధానం చేసుకోని పాన్ కార్డులు చెల్లుబాటు కావని, నిరుపయోగంగా మారుతాయని స్పష్టం చేసింది. ఆదాయపు పన్ను చట్టం 1961 ప్రకారం.. మినహా యింపు పరిధిలోకి రాని పాన్‌కార్డు వినియోగదారులు వారి పాన్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని ఐటి శాఖ శనివారం ట్వీట్ చేసింది.దీనికి 2023 మార్చి 31 వరకు మాత్రమే గడువు ఇస్తున్నట్లు పేర్కొంది. గడువు తేది దగ్గరపడుతోన్న నేపథ్యంలో తక్షణమే అనుసంధానం చేసుకోవాలని సూచించింది ప్రస్తుతం పాన్‌తో ఆధార్ లింక్‌కు రూ.1000 వసూలు చేస్తోంది. ఇంత మొత్తం చెల్లించడం చాలా భారమని లక్షలాది మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఎస్‌డిఎల్ సైట్‌లో పాన్, ఆధార్‌ను అనుసంధానం చేసుకోవడానికి వీలుంది.

మహారాష్ట్ర-కర్ణాటక సరిహద్దు వివాదంపై వైఖరి చెప్పండి

- ప్రధానికి థాకరే డిమాండ్

ముంబయి : మహారాష్ట్ర-కర్ణాటక సరిహద్దు వివాదంపై ప్రధాని మోడీ తన వైఖరిని స్పష్టం చేయాలని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే డిమాండ్ చేశారు. నాగ్‌పూర్ - ముంబయి సూపర్ కమ్యూనికేషన్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభించేందుకు ప్రధాని మోడీ మహారాష్ట్రలో ఆదివారం పర్యటించనున్నారు. జల్నా వద్ద 42వ మరట్వాడా సాహిత్య సమ్మేళన్ ప్రారంభోత్సవంలో శనివారం ఉద్ధవ్ థాకరే మాట్లాడుతూ కర్ణాటకతో నలుగుతున్న సరిహద్దు సమస్యతో పాటు రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న పలు సమస్యలను మోడీ పరిష్కరించాల్సి వుందని చెప్పారు. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లాలోని జత్ తాలుకాలో గల కొన్ని గ్రామాలపై కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై చేస్తున్న వాదన గురించి మోడీ కచ్చితంగా మాట్లాడాలని ఆయన అన్నారు. దశాబ్దాల నాటి ఈ సమస్య ఇటీవల పతాక శీర్షికలకెక్కుతోంది. గత నెల 22న బొమ్మై మాట్లాడుతూ, జత్ తాలుకాపై తమ రాష్ట్రానికి గల హక్కు గురించి రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తోందని అన్నారు. ఆ ప్రకటనతో మహారాష్ట్రంలో రాజకీయ వేడి రాజుకుంది. 1960లో ఏర్పడిన నాటి నుంచి మహారాష్ట్రకు కర్ణాటకతో వివాదం కొనసాగుతోంది. బెల్గాంపై, కర్ణాటకలో మరాఠి మాట్లాడే గ్రామాలపై ఈ వివాదం రేగింది. దీంతో అల్లర్లు, ఆందోళనలు, హింసాకాండ కొనసాగుతూనే వుంటాయి. పాలకులను ప్రశ్నించడం ద్వారా సమాజాన్ని మార్చడంలో రచయితలు కీలకపాత్ర పోషించవచ్చునని థాకరే వ్యాఖ్యానించారు. కేవలం సెమినార్లు పెడితే సరిపోదని, రచయితలు కూడా వీధుల్లోకి వచ్చి పాలకుల తప్పులను ప్రశ్నించాలని అన్నారు. కానీ, ఎవరైతే ప్రశ్నిస్తున్నారో వారిని జైళ్లకు పంపుతున్నారని వ్యాఖ్యానించారు.

న్యాయవ్యవస్థపై పెత్తనానికి కేంద్రం యత్నం

కొలిజీయం వ్యవస్థకు వ్యతిరేకంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో ఉద్ధవ్ థాకరే స్పందించారు. న్యాయ వ్యవస్థను కూడా తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని అన్నారు. న్యాయమూర్తులే న్యాయమూర్తులను నియమించుకోలేకపోతే, అప్పుడు ప్రధాని వారిని ఎంపిక చేయవచ్చని వ్యాఖ్యానించారు.

ఈ ఏడాది 67 మంది జర్నలిస్టుల హత్య

బ్రస్సెల్స్ : ప్రపంచ వ్యాప్తంగా ఈ ఏడాదిలో 67 మంది జర్నలిస్టులు, మీడియా సిబ్బంది హత్యకు గురయ్యారని, 375 మంది జైలు పాలయ్యారని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌జె) పేర్కొంది. ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం, హైతీలో శాంతిభద్రతలు దెబ్బతినడం, మెక్సికోలో క్రిమినల్ గ్యాంగుల బీభత్సం వల్ల గత ఏడాదితో పోలిస్తే 30 శాతం హత్యలు పెరిగాయని తాజా నివేదికలో ఐఎఫ్‌జె తెలిపింది. గత ఏడాది 47 మంది జర్నలిస్టులు హత్యకు గురవగా, ఈ ఏడాది ఆ సంఖ్య 67కు పెరిగింది. గత ఏడాది 365 మంది జైలు పాలవగా, ఈ ఏడాది ఆ సంఖ్య 375కు చేరిందని ఐఎఫ్‌జె ప్రధాన కార్యదర్శి ఆంథోని బెలెంజర్ పేర్కొన్నారు. స్వేచ్ఛా జర్నలిజాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వాలు మరిన్ని చర్యలు తీసుకోవాలని, అణచివేసే ప్రయత్నాలు చేయవద్దని కోరారు. అల్ జజీరా జర్నలిస్ట్ షిరీన్ అబు అక్లేహ్ పాలస్తీనా శరణార్థి శిబిరం నుంచి రిపోర్టింగ్ చేస్తుండగా ఇజ్రాయిల్ ఆమెపై కాల్పులు జరిపి, హత్య చేసిన సంగతి తెలిసిందే.

ఎన్ఇపితో దేశానికి ప్రమాదం

- ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం దేశానికి ప్రమాదకరమని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విఎ సాను తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ప్రకాశం జిల్లా ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో శనివారం జరిగింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి విపి సాను మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యను కాషాయీకరణ, కార్పొరేటీకరణ దిశగా తీసుకెళు తోందని విమర్శించారు. మతోన్మాదాన్ని ప్రేరేపించే పాఠ్యాంశాలను పాఠ్యపుస్తకాలలో చేరుస్తున్నారని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రగతిశీలవాదులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, హిజాబ్ వంటి సమస్యలను సృష్టించి మత కల్లోలాలను కుట్ర చేస్తోందని విమర్శించారు. మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తోందని, నిరుద్యోగం తీవ్రంగా పెరిగిపోతుందని తెలిపారు. విద్యార్థులను చైతన్యవంతులను చేసి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు సాను

పలు తీర్మానాలు ఆమోదం

ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని తీర్మానించారు. డిగ్రీ ఇంటర్న్‌షిప్ ప్రణాళికబద్ధంగా నడపాలని, కోర్సుకు అనుగుణంగా ట్రైనింగ్ ఉండాలని, ఆ సమయంలో స్టైపండ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని సమావేశం డిమాండ్ చేసింది. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పాఠ్యపుస్తకాలు పూర్తిగా ఇవ్వాలని తీర్మానించారు. నూతన జిల్లాల్లో యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని, పిజికి స్పాట్ అడ్మిషన్లను యూనివర్సిటీలోనే నిర్వహించాలని డిమాండ్ చేసింది. జిఒ ఎంఎస్ నెంబర్ 77ని రద్దు చేసి పిజి విద్యకు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని తీర్మానించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ , ఉపాధ్యక్షులు సిహెచ్.వినోద్, రాజా, రామ్మోహన్, మాధవ్, సూర్యచంద్రరావు, పెద్దిరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రీను, కిరణ్ అబ్దుల్లా, బాబావలి, నాగూర్ బి, పావని, పవన్ పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యల రాష్ట్రంగా ఎపి

- టిడిపి అధినేత చంద్రబాబు
- సమస్యలు పక్కదారి పట్టించేందుకే సమైక్య ప్రకటనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు పెరగడం ఆందోళనకరమని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గతంలో రాష్ట్రం వ్యవసాయరంగ వృద్ధిలో, ఆక్వా ఎగుమతుల్లో రికార్డులు సృష్టించిందని తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడేళ్లలో 1673 రైతు ఆత్మహత్యలతో ఆత్మహత్యల రాష్ట్రంగా మారిపోయిందని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు రైతులను అప్పులపాలు చేస్తున్నాయని తెలిపారు. మద్దతు ధరలేకపోవడం, వ్యవసాయ సబ్సిడీలు నిలిచిపోవడం వంటివి అన్నదాతల బలవన్మరణాలకు కారణమవుతున్నాయని వివరించారు. మరోవైపు ప్రభుత్వ టెర్రరిజం తీరుతో ప్రజలపై వేధింపులు, కక్షసాధింపులు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. దీంతో నిస్పృహకు గురైన సామాన్యులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇన్ని సమస్యలు ఉంటే వైసిపి ప్రభుత్వం వాటిపై దృష్టిపెట్టడం లేదని విమర్శించారు. తమ చేతుల్లో లేని సమైక్య రాష్ట్ర అంశంపై బాధ్యతా రాహిత్యంగా ప్రకటనలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలు కలవాలి, కలపాలి అంటూ ప్రజలను గందరగోళంలోకి నెడుతూ సమస్యలను పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. ఎపి విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులపై నోరెత్తని వైసిపి మళ్లీ సమైక్య ఆంధ్రప్రదేశ్ అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం మోసపూరితమని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన కంటే జగన్ పాలన వల్లే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే సమైక్య రాష్ట్ర ప్రకటనలు ఆపి రైతుల ఆత్మహత్యలు, ప్రజల సమస్యలకు కారణాలు విశ్లేషించాలని తెలిపారు. సత్వర స్పందనతో ప్రణాళిక అమలు పరిచి అన్నదాతలకు అండగా నిలవాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

పుట్టినరోజే విషాదం

- నీటితొట్టెలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-రాయదుర్గం

పుట్టిన రోజు వేడుకలు చేసుకున్న కొన్ని గంటల్లోనే ఆ ఇంట విషాదం నెలకొంది. పాఠశాలలో మిత్రులకు మిఠాయిలు పంచి ఇంటికొచ్చిన బాలుడు ప్రమాదంశాత్తు నీటితొట్టెలో పడి మృతి చెందాడు. తీవ్ర విషాదాన్ని నింపిన ఈ ఘటన అనంతపురం జిల్లా రాయదుర్గం మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మల్లాపురం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వన్నూరుస్వామి ఏకైక కుమారుడు నందకిషోర్ (5) శనివారం నాడు పుట్టిన రోజు సందర్భంగా తల్లి సునంద అంగన్‌వాడీ కేంద్రంలో తోటి పిల్లలకు మిఠాయిలను పంచి వేడుకలు నిర్వహించారు. అనంతరం కుమారున్ని ఇంటికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం బాలుడు ఆడుకుంటూ బాత్‌రూం వద్ద నీటి కోసం ఏర్పాటు చేసుకున్న తొట్టెలో ప్రమాదంశాత్తు పడిపోయాడు. కొంతసేపటి తరువాత తల్లి బాలుని కోసం వెతగ్గా బాత్‌రూం నీటి తొట్టెలో కన్పించాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

భారత రాష్ట్ర సమితి ఆవిర్భావం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విజయవాడలోని బందరురోడ్డు ఒక అభిమాని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఉపాధ్యాయ బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- డిసెంబర్ 14 నుంచి దరఖాస్తు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ బదిలీలకు రాష్ట్రప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. ఇందుకు సంబంధించిన జివో 187ను పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శనివారం విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియ ఉంటుంది. కటాఫ్ తేదిగా 2022 ఆగస్టు 31గా ప్రభుత్వం పేర్కొంది. ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్లు ఒకేచోట పనిచేసిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావాలి. ఎలాంటి సర్వీస్ లేకపోయినా (సున్నా సర్వీస్) బదిలీకి దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం మొదటి సారి కల్పించింది. 2024 ఆగస్టు 31లోపు పదవి విరమణ పొందే ఉపాధ్యాయులు బదిలీకి అనర్హులుగా పేర్కొంది. 2021లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. బదిలీల ప్రక్రియ మొత్తం 30 రోజుల్లో పూర్తికానుంది. ఈ నెల 12, 13 తేదిల్లో యాజమాన్యాలు వారీగా, సబ్జెక్టు, మీడియం వారీగా ఖాళీలను పాఠశాల విద్యాశాఖ తన వెబ్‌సైట్‌లో పొందుపరచనుంది. 14 నుంచి 17వ తేది వరకు ఉపాధ్యాయులు బదిలీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 18,19 తేదిల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తారు. 20,21,22 తేదిల్లో సీనియార్టీ లిస్ట్ వెబ్‌సైట్‌లో ఉంటుంది. 23,24 తేదిల్లో వీటిపై అభ్యంతరాలు తెలుపవచ్చు. 26వ తేదిన సీనియార్టీ తుది జాబితా ప్రకటిస్తారు. ఈ నెల 27 నుంచి జనవరి 1వ తేది వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలి. ప్లేస్‌లు కేటాయించిన తుది జాబితాను జనవరి 2 నుంచి 10వ తేది వరకు వెబ్‌సైట్‌లో ఉంచుతారు. ఈ జాబితాపై ఏదైనా ఫిర్యాదులు వస్తే 11వ తేదిన పరిశీలిస్తారు. 12వ తేదిన బదిలీల ఉత్తర్వులను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. మున్సిపల్, గిరిజన ఉపాధ్యాయులకు బదిలీల షెడ్యూల్ విడిగా ఉంటుందని పేర్కొన్నారు.



అసంబద్ధమైన విధానాలు

ఉపాధ్యాయ బదిలీల్లో కొన్ని అసంబద్ధమైన నిబంధనలు తీసుకొచ్చారని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధ్యాయ పోస్టులను మిగులుగా చూపే అశాస్త్రీయమైన విధానాన్ని ప్రభుత్వం చేస్తుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే మ్యాపింగ్ చేయడం, పోస్టులను మిగులుగా చూపడం జరిగిందని చెబుతున్నారు. 2021లో బదిలీ అయి రేషనలైజేషన్‌లో పోస్టు పోతున్న వారికి రేషనలైజేషన్ పాయింట్లను ప్రస్తావించలేదు. మ్యాపింగ్‌కు గురైతేనే అదనపు పాయింట్లు ఇవ్వడం, రేషనలైజేషన్‌కు గురైతే అదనపు పాయింట్లు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు స్పెషల్ పాయింట్లు ఉంటే ఇప్పుడు తొలగించారు. కండర క్షీణత ఉన్న పిల్లల తల్లిదండ్రులకు, వినికిడి లోపం ఉన్నవారికి ప్రాధాన్యత తొలగించడం జరిగింది. పోస్టులను బ్లాకు చేయడం కూడా సరైన పద్ధతి కాదని అంటున్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలి : ఎమ్మెల్సీ సాబ్జీ

మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు కూడా తక్షణమే విడుదల చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. కట్ ఆఫ్ తేదీని 2022 ఆగస్టు 31కు బదులు 2022 నవంబర్ 30గా ప్రకటించాలని ఒక ప్రకటనలో కోరారు. రేషనలైజేషన్ పాయింట్లు కేటాయింపులో పాఠశాలల విలీనమయిన ఉపాధ్యాయులకు మాత్రమే కాకుండా రేషనలైజేషన్ వ్లల ప్రభావితమయిన ఉపాధ్యాయులందరికీ 5 పాయింట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 2021లో బదిలీలు కాబడి ప్రస్తుత రేషనలైజేషన్ గురవుతున్న ఉపాధ్యాయులకు పాత స్టేషన్ పాయింట్లు వర్తింప చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన సవరణ ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లు నమోదు

- టిడిపి ఎమ్మెల్సీ అశోక్ బాబు ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలి ఎన్నికల్లో అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకోసం ముఖ్యమంత్రి జగన్, వైసిపి నేతలు.. వాలంటీర్లు, అధికారయంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి కుట్రలకు పాల్పడుతున్నారని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు విమర్శించారు. నిస్సిగ్గుగా దొంగ ఓట్లు నమోదు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులో రాష్ట్రంలోనే లెక్కకుమించి అవకతవకలు జరిగాయని ఎన్నికల సంఘమే అభిప్రాయపడిందని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో జరిగే ఓటర్ల నమోదు ప్రక్రియలో ప్రభుత్వం భారీగా అవకతవకలకు పాల్పడిందన్నారు. ప్రభుత్వం గంపగుత్తగా ఇచ్చిన 54 వేల ఓటర్ నమోదు దరఖాస్తులపై ఎన్నికల కమిషన్ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన 175 స్థానాలను కుట్రపూరిత విధానాలతోనే గెలవాలనుకుంటున్నారని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ విమర్శించారు.

అంగన్‌వాడీ సిబ్బందిపై జగన్‌ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార సంఘం అధ్యక్షురాలు ఆచంట సునీత విమర్శించారు. ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేక అంగన్‌వాడీ కార్యకర్తలు మృతి చెందడం బాధాకరమని తెలిపారు. అంగన్‌వాడీల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని పేర్కొన్నారు.

గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ

12న ఐటిడిఎల వద్ద ప్రత్యక్ష కార్యాచరణ

- పోస్టర్ ఆవిష్కరించిన యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 12వ తేదీ నుండి ఐటిడిఎల వద్ద ప్రత్యక్ష కార్యాచరణ నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్‌ఎస్ ప్రసాద్ తెలిపారు. ఆందోళనకు సంబంధించిన పోస్టర్‌ను యుటిఎఫ్ రాష్ట్రకార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. జిఓ 3ను సుప్రీంకోర్టు రద్దు చేయడం వల్ల నియామకాలు, పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోవడం వల్ల గిరిజన పాఠశాలల్లో విద్యాభివృద్ధికి తీవ్ర ఆటంకం ఏర్పాడుతోందని తెలిపారు. జివో 3కు చట్టబద్ధత కల్పించాలని, పండిట్, పిఇటిల పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని, బోధనేతర సిబ్బందిని నియమించాలని అధికారులకు పదేపదే ప్రాతినిధ్యం చేశామని వివరించారు. పోరాటాలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం గిరిజన విద్యకు అన్యాయం చేసినట్లేనని విమర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పించాల్సిన సౌకర్యాల్లో కోత విధించడం, 2019 నాటి మెనూ ఛార్జీలు ఇప్పటికీ అమలు చేయడం ద్వారా విద్యార్థులను అర్ధాకలితో ఉంచడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వకపోవడం, హాస్టల్ వార్డెన్, ఏఎన్ఎం నియామకాలు చేపట్టకపోవడం వల్ల విద్యార్థులకు అనారోగ్యం వస్తే పట్టించుకున్న నాథుడు లేకపోవడం గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యారంగ సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా చేస్తున్న ప్రత్యక్ష కార్యాచరణను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సహాధ్యక్షులు కె శ్రీనివాసరావు, కె సురేష్ కుమార్, ఎఎన్ కుసుమకుమారి, కోశాధికారి బి గోపిమూర్తి, కార్యదర్శులు బి.లక్ష్మిరాజా, జి ప్రభాకరవర్మ, ఎ.కృష్ణసుందరరావు, ఎన్.నాగమణి, టి.రఘుపతిరెడ్డి, ఎస్‌పి మనోహర్ కుమార్, ఎస్ మురళీమోహన్, ఎస్‌ఎస్ నాయుడు, వి కోటేశ్వరప్ప, ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, ప్రచురణ కమిటీ ఛైర్మన్ ఎం హనుమంతరావు పాల్గొన్నారు.

నీటి మీటర్ల ఏర్పాటు సిగ్గుచేటు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- విజయవాడలో మీటర్లకు వ్యతిరేకంగా పాదయాత్ర

ప్రజాశక్తి - విజయవాడ

అమృత్ పథకం పేరుతో విషతుల్యమైన షరతులకు లోబడి కృష్ణానదీ తీరాన నీటి మీటర్లు పెట్టడం సిగ్గుచేటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. సహజ వనరులపై ప్రభుత్వ పెత్తనం తగదని, వాటిని ఆదాయ వనరులుగా పరిగణించడం శోచనీయమని అన్నారు. ఇళ్లకు నీటి మీటర్లు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ విజయవాడ 31వ డివిజన్ పసుపుతోటలో సిపిఎం, ప్రజా సంఘాల నేతలు శనివారం పాదయాత్ర నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఇంటింటికీ తిరిగి నీటి మీటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ... ఇప్పటికే భారాలతో సతమతమవుతున్న ప్రజలపై నీటి మీటర్లు పెట్టి మరింత భారం మోపడం అన్యాయమన్నారు. మంచినీటి సరఫరా మొత్తాన్ని బడా కంపెనీలకు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వ విషమ షరతులకు రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గిందన్నారు. విజయవాడలో మీటర్లు పెట్టడం ద్వారా రూ.వంద కోట్ల ఆదాయం గడించడానికి నగరపాలక సంస్థ ప్రయత్నిస్తోందని తెలిపారు.

విజయవాడ పసుపుతోటలో నీటి మీటర్లను పరిశీలించి నిరసన తెలుపుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రమణారావు, కృష్ణమూర్తి తదితరులు

మంచినీటి సరఫరా లోపాలు, నీటి కాలుష్యం తదితర సమస్యలపై ప్రభుత్వం, స్థానిక సంస్థలు దష్టి పెట్టడంలేదన్నారు. నీటి మీటర్ల ఏర్పాటుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఆందోళనకు సిద్ధమవుతున్నారని తెలిపారు. నీటి మీటర్లను నిలిపివేస్తూ మేయర్ ఆదేశాలివ్వాలని, పెట్టిన మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, నాయకులు పి.కష్ణమూర్తి, ప్రజాసంఘాల నేతలు ఆర్.కోటేశ్వరరావు, ఆషా, షకీలా, నాగరాజు, రాము, జగదీష్, సాయికుమార్, గోవిందరావు, రామకష్ణ పాల్గొన్నారు.

పప్పుల చిట్టీల పేరుతో టోకరా

- రూ. కోటితో పరార్
- బాధితుల ఆందోళన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

విశాఖ పాత నగరంలో పప్పుల చిట్టీల పేరుతో సుమారు రూ.కోటి వసూలు చేసి ఒక వ్యాపారి పరారయ్యాడు. దీంతో అతని వద్ద చిట్టీలు వేసిన మహిళలు శనివారం పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం... పాత నగరం లక్ష్మీ టాకీస్ సమీపం గానుగుల వీధిలో మణికుమార్ ఒక దుకాణాన్ని అద్దెకి తీసుకొని తొమ్మిది స్టార్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో కొన్నేళ్లుగా బియ్యం, ఆయిల్ వ్యాపారం చేస్తూ... దసరా, సంక్రాంతి, శ్రావణం, ఉగాది, క్రిస్మస్ వంటి పండగలకు పప్పుల చిట్టీలు పేరుతో మహిళల నుంచి డబ్బు వసూలు చేయడం మొదలుపెట్టాడు.

ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం క్రిస్మస్‌కు చిట్టీలు వేసిన వారికి సరుకులు ఇస్తానని శనివారం రమ్మని చెప్పాడు. ఈ రోజు వారు అక్కడికి వెళ్లగా షాపు తెరిచిలేకపోవడం, ఈ నెల ఒకటి నుంచే షాపు మూతపడిందని తెలవడంతో ఆయనకు ఫోన్ చేశారు. అది పనిచేయకపోవడంతో ఆయన ఇంటికి వెళ్లారు. 15 రోజుల క్రితమే ఇల్లు ఖాళీ చేసినట్లు తెలుసుకున్నారు. దీంతో చిట్టీలు కట్టిన వారందరూ మోసపోయామని గ్రహించి ఆ షాపు ఎదుట ఆందోళనకు దిగారు. అక్కడ నుంచి పాత పోస్ట్ ఆఫీస్ మీదుగా కొత్త రోడ్డు జంక్షన్ వరకు వచ్చి రోడ్డుపై బైఠాయించారు. మణికుమార్‌ను అదుపులోకి తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు.

బాధితుల నిరసనతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వన్ టౌన్ సిఐ రేవతమ్మ అక్కడికి చేరుకొని వారితో చర్చించారు. వారి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మణికుమార్ దోచుకున్న సొమ్ము సుమారు రూ. కోటి ఉంటుందని అంచనావేశారు. మణికుమార్ సిఎం జగన్‌తో కలిసి ఉన్న ఫొటోను తన స్మార్ట్ ఫోన్ కాంటాక్ట్ నెంబర్‌తో ఉంచాడు. దీంతో ఆయనకు అధికార పార్టీ పెద్దల అండ ఉంది అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎపికి మోడీ అన్యాయం

- 'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్నా నోరుమెదపని జగన్
- ఏప్రిల్ 5న మార్చ్ టు పార్లమెంట్ : బి.వెంకట్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి (పశ్చిమగోదావరి)

రాష్ట్రానికి మోడీ అన్యాయం చేస్తున్నారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. వాటిపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మౌనంగా ఉంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు కూడా అదే బాటలో నడుస్తున్నారని విమర్శించారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో మూడు రోజుల పాటు జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ చివరి రోజు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను నాలుగు శాతం నుంచి 1.7 శాతానికి తగ్గించిందని తెలిపారు. దీనిపై వైసిపి ఎంపిలు నోరు మెదపకుండా ఆమోదించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి హామీకి కావాల్సినన్ని నిధులు వచ్చేవని, ఇప్పుడు బతిమాలాడుకోవాల్సి వస్తోందని తెలిపారు. కేంద్రాన్ని ఏ మాత్రమూ ప్రతిఘటించకుండా జగన్ అన్నింటినీ గుడ్డిగా బలపరుస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో డబుల్ ఇంజిన్ అదాని-అంబాని, మోడీ-అమిత్‌షా ప్రభుత్వాలు నడుస్తు న్నాయన్నారు. దేశంలో, రాష్ట్రాల్లోని ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీసి కార్పొరేట్లకు కట్టబెడుతోందని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని, కృష్ణపట్నం పోర్టు, ముంబయి విమానాశ్రయాన్ని అదానీకి కట్టబెట్టిందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లోని భూములను సైతం కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చట్టాలను సవరిస్తోందని విమర్శించారు. మోడీ ప్రధాని కాక ముందు అదాని ఆస్తి రూ.30 వేల కోట్లు అని, ప్రస్తుతం రూ.13 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. భారత దేశం లౌకిక రాజ్యమన్నారు. దీన్ని మత రాజ్యంగా మార్చేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని, జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఆహార భద్రత ఉండాలని, ఎఫ్‌సిఐను ఎత్తివేసే చర్యలు వీడాలని, కేరళ తరహాలో 12 రకాల వస్తువులను ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. దళితులకు అనుకూలమని జగన్ అంటుంటారని, క్రిస్టియన్ మతంలోకి మారిన దళితులను ఎస్‌సి రిజర్వేషను తప్పించి బిసి 'సి'లో చేర్చినా మౌనంగా ఉండడం శోచనీయమన్నారు. దేశ జిడిపిలో వ్యవసాయ ఆదాయం 18 శాతం ఉండగా ఎపిలో 52 శాతం ఉందని తెలిపారు. వ్యవసాయంలో ప్రధాన భూమిక పోషిస్తోన్న కార్మికుల పట్ల జగన్ వైఖరి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి కుటుంబానికీ రెండెకరాలు భూమి ఇవ్వాలని, అమరావతిపై కోర్టు తీర్పులను అడ్డం పెట్టుకుని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పించుకోవడం తగదని అన్నారు. పోలవరం నిర్వాసితులకు కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చేలా మోడీపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే సంవత్సరం ఏప్రిల్ ఐదున మార్చ్ టు పార్లమెంట్ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు పాల్గొంటాయని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.జీవరత్నం, పివి.రామకృష్ణ పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాపాడుకుందాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

కార్మికులు తమ హక్కులను కాపాడుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 667వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పి విభాగం కార్మికులు కూర్చున్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విశాఖ మానవ హక్కుల వేదిక అధ్యక్షులు జహీర దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశంలో మానవ హక్కులకు కూడా ప్రమాదం తలెత్తే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను పెంచిన కార్మిక వర్గానికి అన్యాయం జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని, 44 కార్మిక హక్కులను నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తున్నారని తెలిపారు. పెట్టుబడిదారుల కనుసన్నల్లో చట్టాలు తయారవుతున్నాయని విమర్శించారు. రాబోయే కాలంలో కార్మికులు తమ హక్కులను కాపాడుకోవడం కోసం పోరాటాలు చేయాల్సిన అవసరముందని అన్నారు. మానవ హక్కుల వేదిక సంఘ సభ్యులు ఎం.అప్పారావు, దినేష్, రెహమాన్ తదితరులు సందర్శించిన వారిలో ఉన్నారు. దీక్షలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎం రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, జె.రామకృష్ణ, కొమ్మినేని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా వజ్రోత్సవ సభలో మాట్లాడుతున్న డి రమాదేవి

మహిళా సమానత్వం కోసం ప్రభుత్వం కృషి చేయాలి

- ఐద్వా వజ్రోత్సవాల్లో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళా సాధికారత, సమానత్వం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని ఐద్వా వజ్రోత్సవాల్లో వక్తలు కోరారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఐద్వా వజ్రోత్సవాల్లో భాగంగా 'అత్యాచారాల నివారణ- సమానత్వ సాధన' అంశంపై శనివారం ఎంబి విజ్ఞాన కేంద్రంలో సెమినార్ జరిగింది. ఐద్వా నాయకులు లక్ష్మీ, జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి మాట్లాడారు. సంప్రదాయాల పేరుతో మహిళలపై అణచివేత ఇంకా కొనసాగుతోందని రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ హింస, వరకట్న వేధింపులు కొనసాగుతున్నాయని, ఇప్పటికీ సమాన ఆస్తి హక్కు చట్టం అమలు కావడం లేదన్నారు. చిన్నారులపై ఆత్యాచారాల కేసుల్లో తక్షణ విచారణకు తగినన్ని ఫోక్సో కోర్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మద్యం నియంత్రణ చేపడతామన్న హామీని ప్రభుత్వం అమల్జేయడం లేదని విమర్శించారు. డ్వాక్రా మహిళలను ప్రభుత్వం బానిసలుగా ఉపయోగించుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రూపులో సభ్యురాలు మృతిచెందితే మిగిలిన సభ్యులు రుణం తీర్చాలనే నిబంధన సరికాదన్నారు. దీనిని తొలగించాలనే డిమాండ్‌ను వీధివీధిన వినిపించాలని కోరారు. మహిళలు నిర్ణయత్మాక శక్తిగా మారాలని కోరారు.

'పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు' అనే అంశంపై శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు కె స్వరూప రాణి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు రకరకాల వేధింపులకు గురువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాందేవ్ బాబా, గరికపాటి నరసింహారావు వంటి వారు మహిళలను చులకనగా చేస్తూ మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 2020 కంటే 2021లో 15 శాతం ఆడపిల్లలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్భయ లాంటి చట్టాలను పటిష్టంగా అమలు చేస్తే మహిళలపై దాడులు తగ్గుతాయని చెప్పారు. లైంగిక వేధింపుల అత్యాచార నిరోధక చట్టం గురించి చాలామందికి అవగాహన లేదన్నారు. పని ప్రదేశాల్లో వేధింపుల నిరోధకానికి ఏర్పాటు చేసిన కమిటీలు పనిచేస్తున్నాయో లేదో చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. ఎపి మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవానీ మాట్లాడుతూ సమానత్వంపై ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ సహాయ అధ్యక్షులు కుసుమ కుమారి, సమన్విత కన్వీనర్ డి శమంతకమణి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, సెక్రటరీ డి శ్రీనివాసకుమారి, ఉపాధ్యక్షురాలు పూర్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు పద్మ, సరోజ, పద్మజ, ఉదయ, శ్రీదేవి, రమాదేవి, రమణి, శ్రామిక మహిళా కన్వీనర్ నాయకురాలు దయా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు

(మొదటి పేజి తరువాయి)

చేపట్టాలని మహాసభ డిమాండ్ చేసింది. జిఒ నెంబర్ 73/2022ను సవరించి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస నూతన వేతన చట్టాన్ని ప్రకటించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కూలి ఇవ్వడంలో మహిళల పట్ల వివక్ష విడనాడాలని, ప్రతి కుటుంబానికీ 200 రోజులు ఉపాధి హామీ పని చూపాలని, రోజువారీ వేతనం రూ.600కు పెంచాలని, పట్టణాల్లోని పేదలకూ ఉపాధి పనులు చూపాలని తీర్మానించింది. ఉపాధి హామీ చట్టానికి కేంద్రం బడ్జెట్‌లో లక్షా 50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేసింది. రెండో పూట పని, మస్తర్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, పని ప్రదేశాల్లో మృతి చెందిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయరాదని, క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ జోక్యం ఉండరాదని డిమాండ్ చేసింది. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు తిరిగి పేదలకు ఇవ్వాలని, కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, భూయజమాని అనుమతి లేకుండానే గ్రామసభల్లో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసేలా సిసిఆర్‌సి చట్టాన్ని సవరించాలని, దేవాలయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు రక్షణ కల్పించాలని, వ్యవసాయ కార్మికుల రుణమాఫీ చట్టం చేసి అమలు చేయాలని, వలసలు నివారించాలని, పనుల్లేని రోజుల్లో కుటుంబానికి నెలకు రూ.5 వేలు భృతి ఇవ్వాలని, ప్రతి పేద కుటుంబానికీ ప్రజాపంపిణీ ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని, వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్మిక చట్టం చేయాలని తీర్మానించింది. వీటితోపాటు పలు తీర్మానాలను ఆమోదించింది.

హిందూత్వ అజెండాను తిప్పికొట్టాలి : వి.శ్రీనివాసరావు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ హిందూత్వ అజెండాను వ్యవసాయ కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మహాసభలో ఆయన సౌహార్ధ్ర సందేశం ఇచ్చారు. సంక్షేమ పథకాలు పేదల హక్కని తెలిపారు. అయితే, వాటితోనే పేదల బతుకుల్లో మార్పు రాదని అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధిగా చూడొచ్చన్నారు. నూతన ఆర్థిక విధానాల పేరుతో పేదలపై బిజెపి దాడి చేస్తోందన్నారు. ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య విభజన సృష్టించడానికి మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టాలని చూస్తోందని, కులవివక్షను పునరుద్ధరించాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు.

వ్యవసాయ కార్మికుల కోసం కేరళ తరహాలో ప్రత్యేక చట్టం ఉన్నప్పుడే హక్కులు సాధ్యమన్నారు. గుజరాత్ నమూనా కార్పొరేట్ నమూనా అని, కేరళ నమూనా పేదల నమూనా అని పేర్కొన్నారు. రాష్ట్రంలో మోడీకి తోలుబొమ్మలుగా జగన్, చంద్రబాబు, పవన్ మారారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఆవిర్భవించిన ప్రాంతీయ పార్టీలు తెలుగు వారి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నాయన్నారు. సోషల్ ఇంజినీరింగ్ పేరుతో బిజెపి రాష్ట్రంలో అధికారంలోకి రావాలని చూస్తోందని, రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే చంద్రబాబు, పవన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని తరిమికొట్టాలని, ఉపాధి హామీ పనుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బహుముఖ కృషి, విశాల వేదికలతో వ్యవసాయ కార్మిక సంఘం ముందుకు సాగాలన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న సౌహార్ద్ర సందేశాలిచ్చారు.

ప్రయాణికురాలికి తొలి టికెట్ అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

'ఆకాశ ఎయిర్' విమాన సేవలు ప్రారంభం

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆకాశ ఎయిర్ లైన్స్ ద్వారా విశాఖ, బెంగళూరు మధ్య తొలి విమాన సర్వీసును విశాఖ విమానాశ్రయంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నూతన విమాన సర్వీసు విశాఖ నుంచి నేరుగా బెంగళూరుకు, బెంగళూరు నుంచి విశాఖకు రాకపోకలు సాగిస్తుందన్నారు. ప్రస్తుతం ఆకాశ సంస్థ తొమ్మిది ప్రధాన నగరాల్లో తన సర్వీసులను నడుపుతోందని, విశాఖ నుంచి పదో సర్వీసును ప్రారంభించడం అభినందనీయమన్నారు. విశాఖలో త్వరలో గ్లోబల్ సమ్మిట్, జి 20 సమావేశాల నేపథ్యంలో మరిన్ని విమాన సర్వీసులు అవసరముందని పేర్కొన్నారు.

ఆకాశ సంస్థ ప్రతినిధులు ప్రవీణ్ ఐయ్యర్, ఆకుల అరవింద్, సాగర్ నాయక్ మాట్లాడుతూ.. త్వరలో హైదరాబాద్, లక్నో, గోవాలో తమ సంస్థ సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆకాశ ఎయిర్ లైన్స్‌లో విశాఖపట్నం నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రయాణికురాలికి మంత్రి అమర్‌నాథ్ తొలి టికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఎయిర్ పోర్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, విశాఖ విమానాశ్రయం సలహా మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, ఎపి టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విజయమోహన్ పాల్గొన్నారు.

తొలి వారమంతా ఓడి లోనే

తాజాగా 2,309 కోట్లు నమోదు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

డిసెంబర్ నెలలో తొలి రోజు నుంచి రాష్ట్ర ఖజానా ఓడి లోనే కొనసాగుతోంది. వరుసగా ఏడు రోజుల పాటు ఓడిపైనే ఆధారపడటం చర్చనీయాంశంగా మారింది. డిసెంబర్ ఒకటో తేదీన 1,931 కోట్ల రూపాయల ఓడికి వెళ్లిన ప్రభుత్వం అక్కడి నుంచి రోజూ ఓవర్‌డ్రాఫ్ట్‌లోనే కొనసాగుతోంది. వారాంతమైన ఏడో తేదీన కూడా 1, 892 కోట్ల రూపాయలను ఓడిగా తీసుకుంది. రెండో వారం తొలి రోజు అయిన ఎనిమిదో తేదీన కూడాటూ. 2,309 కోట్లు ఓవర్‌డ్రాఫ్ట్‌గా నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ పన్నులు, ఇతర కోణాల్లో వచ్చే ఆదాయం తక్షణమే ఓవర్‌డ్రాఫ్ట్ కింద జమైపోతున్నప్పటికీ, ఓడీ మాత్రం జీరోకి రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

సిపిఎస్ రద్దుకు 5కె వాక్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యాన 5కె వాక్ కార్యక్రమం నిర్వహించారు. కంబాల చెరువు సెంటర్ నుంచి పుష్కర్‌ఘాట్ వరకూ వాక్ నిర్వహించి అనంతరం మానవహారాన్ని నిర్మించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడుతూ జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి చిన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా సిపిఎస్‌ను రద్దు చేశారని, ఇటీవల రాజస్థాన్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లోనూ రద్దు చేయగా ఎపిలో ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దు చేయకపోతే మరిన్ని ఐక్య ఉద్యమాలు నిర్మించి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సిపిఎస్ పెన్షన్లు ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఇచ్చే సామాజిక పెన్షన్ల కన్నా తక్కువగా ఉండడం దారుణం అన్నారు. ఈ విషయాన్ని ప్రజలూ గుర్తించాలని కోరారు. యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి ఎన్ అరుణ కుమారి, సిపిఎస్ కన్వీనర్ రమేష్‌బాబు, సిఐటియు కార్యదర్శి అరుణ్, నాయకుడు పవన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ కార్యదర్శి ఎన్ రవి బాబు, కె రమేష్ బాబు, విజయ గౌరి, డివివి సత్యనారాయణ, ఎం శ్రీనివాస్, మహాలక్ష్మి, శ్రీమణి, జెవి సుబ్బారావు పాల్గొన్నారు.

మానవహారం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జి

గ్రామీణ బ్యాంకుల పట్ల కేంద్రం వివక్ష

- ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామీణ బ్యాంకుల పట్ల కేంద్రం వివక్ష ప్రదర్శిస్తోందని ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గుంటూరులో సంఘం ఎపి, తెలంగాణ మహిళా ఉద్యోగుల సమావేశం శనివారం జరిగింది. సిజిజిబి ఛైర్మన్ టి కామేశ్వరరావు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఛైర్ పర్సన్ శోభ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ జాతీయ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులకు నియామక విధానం ఒకేలా ఉన్నా... సర్వీసు రూల్స్, వేతనాలు వేర్వేరుగా ఉన్నాయన్నారు. గ్రామీణ బ్యాంకుల్లో వేతనాలు తక్కువగా ఉండటం వల్ల ఉద్యోగులు కొద్దికాలం పనిచేసి జాతీయ బ్యాంకులకు వెళ్లిపోతున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా 43 గ్రామీణ బ్యాంకులు, 21,500 శాఖల్లో లక్ష మంది ఉద్యోగులు, 40 కోట్ల మంది ఖాతాదారులు, రూ.తొమ్మిది లక్షల కోట్ల టర్నోవర్ కలిగి ఉన్నాయన్నారు. ఇంతటి కీలక బ్యాంకుల పట్ల కేంద్రం వివక్ష తగదన్నారు. గ్రామీణ బ్యాంకులన్నిటికీ కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని కోరారు. గ్రామీణ ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్న బ్యాంకులను ప్రయివేటుపరం చేయాలని ప్రయత్నించటం సరికాదన్నారు. వాణిజ్య బ్యాంకు ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిజిజిబి అధికారుల సంఘం మహిళా ప్రతినిధి నియామతున్నీసా, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎండి మజీద్, వర్కింగ్‌ప్రెసిడెంట్ కె కోటేశ్వరరావు, ట్రెజరర్ డి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

బిసిలకు అవమానం

- టిడిపి నేత కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలో వైసిపి ఇటీవల నిర్వహించిన 'జయహో బిసి' సభలో బిసి సోదరులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమక్షంలోనే అవమానించారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుర్చీలో కూర్చొని మాట్లాడుతుంటే బిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపి, నాయకులను నిల్చోని మాట్లాడటం యావత్ బిసి సోదరులందరికీ అవమానకరమని ఆయన పేర్కొన్నారు. బడుగు, బలహీన మంత్రుల అధికారాలను లాక్కొని సామంతరాజులకు జగన్ అప్పగించారని విమర్శించారు.

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ చేయాలి : బొప్పరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెండో విడత నోటిఫికేషన్ ద్వారా విధుల్లో చేరిన 16 వేల మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని, వారికి పేస్కేలు వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలో బృందం శనివారం ఆ శాఖ కమిషనరును కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం విజయవాడ రెవెన్యూ కార్యాలయంలో బొప్పరాజు మీడియాతో మాట్లాడారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలు వెంటనే చేయాలని, భార్యభర్తలు వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిజిటల్ అసిస్టెంట్/వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ కోసం గ్రామవార్డు సచివాలయాల్లో ప్రత్యేక గదిని కేటాయించాలని విజ్ఞప్తి చేశామన్నారు.

మీడియా సమావేశంలో ఎపి జెఎసి అమరావతి సెక్రటరీ జనరల్ వైవి రావు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వి.ఆర్లయ్య, ఉపాధ్యక్షులు జి.జ్యోతి, కె.సుధీర్, కోశాధికారి బి.జగదీష్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ బ్యాటరీ-5లో పేలుడు

- ముగ్గురు కాంట్రాక్టు కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్యాటరీ-5లో జరిగిన పేలుడులో ముగ్గురు కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఉదయం 11 గంటల సమయంలో స్టీల్‌ప్లాంట్‌లోని సిఒసిసిపి విభాగంలో ఆయిల్ స్టోరేజీలోని ట్యాంక్ నెంబర్ 11లో పనులు చేస్తుండగా పేలుడు సంభవించింది. ఈ పేలుడులో పెదగంట్యాడకు చెందిన పరమేశ్వరరావు, గంగవరం గ్రామానికి చెందిన నగేష్, చెట్టివానిపాలేనికి చెందిన ఏకాశి గాయపడ్డారు. ఆయిల్ ట్యాంక్‌పై కొంత వెల్డింగ్ పని చేసేందుకు ముగ్గురు కార్మికులు ట్యాంక్‌పైకి ఎక్కారు. వెల్డింగ్ చేస్తుండగా పేలుడు సంభవించింది. ట్యాంక్‌పై నుంచి కార్మికులు కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని ప్రాథమిక చికిత్స కోసం స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్‌కి తరలించారు. వారిలో నగేష్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం మల్కాపురంలోని ఇఎస్‌ఐ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి విశాఖలోని ఇండస్ హాస్పిటల్‌కి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. గాయపడ్డ కార్మికులకు న్యాయం జరిపించేందుకు యాజమాన్యంతో మాట్లాడుతున్నామని, వారికి సరైన న్యాయం చేసేంతవరకు పోరాడతామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ తెలిపారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సాయిదాపేట, చెన్నై-600015, తమిళనాడు, ఇండియా.

సవరణ

ఈ వార్తా పత్రికలో 02.09.2022న ప్రచురించబడిన డిమాండ్ నోటీసుకు ఇది సూచన రుణగ్రహీత పేరు శ్రీ. నాగేంద్రం పాలపర్తి, భర్త. వెంకటేశ్వర్లు పాలపర్తి, ఎల్ఎఎన్ నం.: AP/VWD/BENZ/A000000520 అందులో మేము పేర్కొన్న బకాయి రూ. 44,21,258/- (నలభై నాలుగు లక్షల ఇరవై ఒక వేల రెండు వందల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే) మొత్తాన్ని రూ. 43,85,369/- (నలభై మూడు లక్షల ఎనభై ఐదు వేల మూడు వందల అరవై తొమ్మిది రూపాయలు మాత్రమే)గా చదవవచ్చు. పేర్కొన్న నోటీసులో ప్రచురించబడిన అన్నీ నిబంధనలు మరియు షరతులు అలాగే ఉంటాయి.

సం/- అధీకృత అధికారి,
హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

HDFC BANK
We understand your world

రిజిస్టర్డ్ ఆఫీస్: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోవర్ పారెల్ (పశ్చిమం), ముంబాయి-400013 మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, I-థింక్ టెక్నో క్యాంపస్, కంజూర్ మార్గ్ (తూర్పు), ముంబాయి-400042 వద్ద ఉన్న రిటైల్ పోర్ట్ ఫోలియో నిర్వహణగా దాని కార్యాలయం ఒకటి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయ సమాచారం మరియు పబ్లిక్ నోటీసు.

హెచ్‌డిఎఫ్‌సి ("ది బ్యాంకు") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బ్యాంకుకు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి, రుణం/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం దీని ద్వారా తెలియజేయబడుతుంది.
అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డీఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయని బ్యాంకు ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ ప్లడ్జ్‌ను చేయించిన మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది. విఫలమైతే బ్యాంక్ ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి స్వేచ్ఛ ఉంటుంది. రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురయ్యారు మరియు సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి రుణ బప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో ప్లడ్జీగా రుణగ్రహీతల నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలను రికవరీ చేయడానికి 18 డిసెంబర్, 2022న లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించడాని/పారవేయాలని నిర్ణయించింది. రుణగ్రహీతలు మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించడానికి స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఎప్పుడైనా తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు తన అభీష్టానుసారం తాకట్టు పెట్టిన సెక్యూరిటీని క్యాలెండర్ రోజు ఒకటి (1) లోపు విక్రయిస్తుంది. రుణగ్రహీతలు ఏదైనా మిగిలిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత బ్యాంకుకు బాధ్యత వహిస్తారు.

క్ర. సం.	లోన్ ఎకౌంట్ నెం.	రుణగ్రహీతల పేర్లు	అసాధారణ మొత్తం 7 డిసెంబర్, 2022 నాటికి	విక్రయ నోటీసు యొక్క తేదీ
1	XXXX1156	రాధాకృష్ణ మూర్తి దైవల	58,480.24	9-Dec-22
2	XXXX0190	రమేష్ వి కె ఎన్ పూసర్ల	3,321.42	9-Dec-22
3	XXXX5087	పంచల వీర రాఘవేంద్ర రావు	35,642.34	9-Dec-22
4	XXXX4597	నిర్మల హృదయ కొసూరి	784,158.97	9-Dec-22
5	XXXX3359	కె. వేణుగోపాల్ రాజు	1,397,344.95	9-Dec-22
6	XXXX3985	గుంటూరి ఎస్ ఆర్ పద్మావతి	282,988.67	9-Dec-22
7	XXXX9896	కె. విశ్వనాథ్	70,086.63	9-Dec-22
8	XXXX2705	జంపాల జయప్రకాష్	1,716,973.40	9-Dec-22
9	XXXX2058	డి. వెంకటేశ్వరరావు	1,072.00	9-Dec-22
10	XXXX2749	ధర్నాలకోట వీరవెంకట హ్యాచక్రదారై	157,482.89	9-Dec-22
11	XXXX2101	అలేఖ్యా ధరనాలకోట	76,931.00	9-Dec-22

తేదీ: 11.12.2022
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్.
సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్.

ఐఆర్‌డిఎఐ డ్రాఫ్టును కేంద్రం ఉపసంహరించుకోవాలి

- ఎల్ఐసిఎఒఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శి పిజి దిలీప్
- ఎల్ఐసి ఏజెంట్లు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి
- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- ఇందిరాపార్కు వద్ద ఎల్ఐసిఎఒఐ ఆధ్వర్యంలో మహాధర్నా
- 19 రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ఎల్ఐసి ఏజెంట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డిఎఐ) డ్రాఫ్టును వెంటనే ఉపసంహరించుకోవాలని ఎల్ఐసిఎఒఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శి పిజి దిలీప్ డిమాండ్ చేశారు. ఐఆర్‌డిఎఐ డ్రాఫ్టును ఉపసంహరించుకోవాలని శుక్రవారం ఎల్ఐసిఎఒఐ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల నుంచి వేలాదిమంది ఎల్ఐసి ఏజెంట్లు తరలివచ్చారు. ప్లకార్డులతో తమ డిమాండ్లను తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2003లో ట్రేడ్ యూనియన్ యాక్ట్ ప్రకారం ఎల్ఐసిఎఒఐ ఆవిర్భవించిందని.. ఆ నాటి నుంచి ఏజెంట్ల సంక్షేమం కోసం పాటుపడుతూ ఎన్నో పోరాటాలు చేసి అనేక హక్కులను కాపాడుతోందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఐఆర్‌డిఎఐ డ్రాఫ్ట్ వల్ల ఎల్ఐసి ఏజెంట్ల మనుగడతోపాటు వ్యవస్థ కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. డ్రాఫ్ట్‌ను ఉపసంహరించ కోకపోతే దేశ వ్యాప్తంగా ఎల్ఐసి ఏజెంట్లు పెద్దఎత్తున ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థను అగ్రభాగాన నిలబెట్టడంలో ఎల్ఐసి ఏజెంట్ల పాత్ర మహోన్నతమైందని చెప్పారు. ఇలాంటి వ్యవస్థను కాపాడాల్సిన ప్రభుత్వం దాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ బంగాళాఖాతంలో కలిపివేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలను ప్రధాని, తెలంగాణ సిఎంకు లేఖల ద్వారా పంపించి వివరిస్తామని చెప్పారు. ఆర్గనైజేషన్ సౌత్ జోన్ అధ్యక్షులు ఎల్ మంజునాథ్, ప్రధాన కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ.. ఎల్ఐసిని నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో లక్షలాదిమంది ఎల్ఐసి ఏజెంట్లు నిరుద్యోగులుగా మారే ప్రమాదం ఉందన్నారు. దేశ ప్రజలంతా కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. ఐఆర్‌డిఎఐ డ్రాఫ్ట్‌ను ఉపసంహరించుకునే వరకు పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆలిండియా వైస్ ప్రెసిడెంట్, మాజీ ఎంపి వాసుదేవ్ ఆచార్య, ఏఐఐఈఏ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా పాల్గొన్నారు.

మహాధర్నాలో ప్రసంగిస్తున్న దిలీప్

InCred Borrow. With Confidence.

ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
(గతంలో కెకెఆర్ ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)
ఆఫీసు చిరునామా: డో.నం.57-2-15, 2వ అంతస్తు, శ్రీ నివాస్, పంటకాలువ రోడ్డు, విజయవాడ-520010.
ఆధీకృత అధికారి-సి. శ్రీకాంత్; సంప్రదించాల్సిన వివరాలు: 9866010586
srikanth.cindam@incred.com

అనుబంధం-IV-A (రూల్ 8(6) నిబంధనను చూడండి)
స్థిరాస్తుల అమ్మకం కోసం విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 (6) నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 కింద స్థిరాస్తుల అమ్మకం కోసం విక్రయ నోటీసు.
సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టిన/ఛార్జ్‌చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తులు ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ యొక్క ఆధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకోబడిందని సాధారణంగా ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత/హామీదారులు/ తాకట్టు పెట్టిన వారు (లు)కి నోటీసు ఇవ్వబడింది. 1) సూపర్ విజ్ ప్రొఫెషినల్స్ ప్రైవేట్ లిమిటెడ్, 2) మామిడి ఆది వెంకటనాగ వీరాంజనేయ గుప్త 3) ఎమ్. లక్ష్మి వెంకట నాగ దమయంతి నుండి ఇంక్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ కి బకాయిగా తేది: 12.01.2022 నాటి డిమాండ్ నోటీసు ఆధారంగా మొత్తం రికవరీ కోసం రూ. 2,53,46,748.14/- (రెండు కోట్ల యాభై మూడు లక్షల నలభై ఆరు వేల ఏడు వందల నలభై ఎనిమిది రూపాయల పద్నాలుగు పైసలు మాత్రమే) "ఎక్కడ ఉన్నాయో అక్కడే ", "ఏమి ఉన్నాయో వాటినే ", మరియు "ఏది ఉంటే అదే " పద్ధతిలో తదుపరి బహిరంగ వేలం ద్వారా మంగళవారం, 27 డిసెంబర్, 2022 మ.03.00గం.ల నుండి సా.06.00గం.ల వరకు విక్రయించబడతాయి. మరియు దానికి రిజర్వు ధర ఐఎన్ఆర్: 2,52,32,369/- (రెండు కోట్ల యాభై రెండు లక్షల ముప్పై రెండు వేల మూడు వందల అరవై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు ధరావత్తు (ఇఎమ్‌డి) ఐఎన్ఆర్ 25,23,236/- (ఇరవై ఐదు లక్షల ఇరవై మూడు వేల రెండు వందల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే) కు డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు ఆస్తి కొనుగోలు కొరకు సీల్డు వేలం నిర్వహించుటకు గాను ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి చేత సోమవారం 26 డిసెంబర్, 2022 సా.6 గం.ల వరకు స్వీకరించబడుతుంది. ఆస్తి తనిఖీ సోమవారం 19 డిసెంబర్, 2022 నుండి సోమవారం 26 డిసెంబర్, 2022 వరకు జరుగుతుంది. వేలం యొక్క తేదీ మరియు ప్రదేశం: మంగళవారం 27 డిసెంబర్, 2022 మ.03.00 గం.ల నుండి సా.06.00 గం.ల వరకు డో.నం.57-2-15, 2వ అంతస్తు, శ్రీ నివాస్, పంటకాలువ రోడ్డు, విజయవాడ-520010.

తనఖా ఆస్తి యొక్క వివరణ:

ఆస్తి 1: కృష్ణాజిల్లా, నూజివీడు ఎస్ఆర్ఓ పరిధిలో రామన్నగూడెం లో ఉన్న స్థలం ఆ ముక్క మరియు పార్శిల్ ఆర్.ఎస్.నంబర్లు 7/3ఎ, 6/1 పరిధిలో 1677.77 చ.గజాలు. లేదా 1402.81 చ.మీటర్లు. కట్టుదిట్టమైన: ఉత్తరం: బసవ పెరిండమ్మ కు చెందిన మిగిలిన స్థలం, దక్షిణం: పాసేజ్, తూర్పు: శ్రీ మామిడి ఆది నాగ వీరాంజనేయ గుప్తా కు చెందిన స్థలం, పడమర: నూజివీడు నుండి విజయవాడకు దారితీసే ఆర్ అండ్ బి రోడ్డు.

ఆస్తి 2: కృష్ణాజిల్లా, నూజివీడు ఎస్ఆర్ఓ పరిధిలో నూజివీడు నుండి విజయవాడకు దారి తీసే తూర్పు వైపు మరియు పడమర వైపు వరకు ఉమ్మడి పాసేజ్‌తో పాటు రామన్నగూడెం లో ఉన్న స్థలం ఆ ముక్క మరియు పార్శిల్ ఆర్.ఎస్.నం.10/1బి, 10/2 పరిధిలో ఎసి. 2.72 సెంట్లు. లేదా 13164.8 చ.గజాలు. కట్టుదిట్టమైన: ఉత్తరం: అప్పినేని వీరభద్రరావుకు చెందిన స్థలం, దక్షిణం: ఎమ్ఎవిఎన్‌వి గుప్తా, తండ్రి. పిచ్చయ్యకు చెందిన స్థలం, తూర్పు: చెరువు, పడమర: అప్పినేని వెంకట నరసయ్యకు చెందిన స్థలం.

అన్నీ భవనములు మరియు నిర్మాణాలతో కలిసి లేదా భూమికి జోడించబడిన దేనికైనా వర్తమానం మరియు భవిషత్తు రెండూ శాశ్వతంగా కట్టుబడి ఉంటాయి.
వేలం యొక్క వివరణాత్మక నియమాలు మరియు షరతుల కోసం ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అందించిన వెబ్‌సైట్ లింకు అనగా https://www.incred.com/Auction_notices.html ని దయచేసి సందర్శించండి.

తేదీ: 10 డిసెంబర్, 2022,
ప్రదేశం: కృష్ణాజిల్లా.
సం /-
ఆధీకృత అధికారి,
ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.

బిజెపి, వైసిపి ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు
- మోడీకి భయపడి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతున్న వైసిపి, టిడిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల పై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో శనివారం జరిగిన పార్టీ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మూడురోజుల పాటు మేధోమథన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ప్రధాని మోడీకి భయపడి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నాయన్నారు. బిజెపితో పోరాడేశక్తి కాంగ్రెస్ పార్టీకే మాత్రమే ఉందన్నారు. పార్టీలో 50 శాతం పదవులను ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. పార్టీలో నాయకత్వాన్ని పెంపొందించేం దుకు అన్నిస్థాయిల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు రుద్రరాజు వెల్లడించారు. సంస్థాగతంగా బలోపేతం చేయడానికి అవసరమైన చోట కమిటీలను పునర్నిర్మాణం చేస్తామని తెలిపారు.

ఈనెల 28న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త ఇంటిపై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్‌గా నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షులు చేవూరి దేవకుమార్‌రెడ్డిని నియమించినట్లు గిడుగు వెల్లడించారు. మీడియా సమావేశంలో ఎఐసిసి సెక్రటరీ మయప్పన్, వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, కిసాన్‌సెల్ ఛైర్మన్ జెట్టి గురునాథం, కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుల అభివృద్ధికి నిధులు : జివిఎల్

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి, అమరావతి బ్యూరో

దేశంలో మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి రైతులకు మేలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో ఒక ప్రణాళిక రూపొందించిందని చిల్లీస్ టాస్క్‌ఫోర్సు ఛైర్మన్ జివిఎల్ నరసింహారావు తెలిపారు. గుంటూరు మార్కెట్ యార్డులో చిల్లీస్ ఎక్స్ పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నూతన కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 200 ఎకరాల్లో గుంటూరు మిర్చి యార్డు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన త్వరగా ఆమోదం పొందాలన్నారు. గుంటూరు మిర్చి యార్డు విస్తరణకు కేంద్రం నుంచి నిధులు తెప్పిస్తామన్నారు. కార్యక్రమంలో గుంటూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, కార్యదర్శి ఐ వెంకటేశ్వర్ రెడ్డి, చిల్లి ఎక్స్ పోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెలగపూడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

- విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలోనూ జివిఎల్ మాట్లాడారు. రాష్ట్రానికి ఐటి పరిశ్రమలు రాకపోవడానికి కుటుంబ పార్టీలే కారణమన్నారు. కమీషన్లపైనే ఆ పార్టీలకు శ్రద్ధ ఎక్కువని ఆరోపించారు. 2024లో ఓడిపోతామనే భయంతోనే వైసిపి 'సమైక్య రాష్ట్రం' అంశాన్ని తెరమీదకు తెస్తోందన్నారు.

చంద్రబాబుకు ఆదరణతో జగన్ బిసి జపం

- టిడిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బుద్ధా వెంకన్న

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తోందని, దీనిని చూసి ముఖ్యమంత్రి జగన్ భయపడి బిసి జయహో పేరుతో సభ నిర్వహించారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో 1994 ఎన్నికలు రిపీట్ అవుతాయని, ఇక్కడ 34 అసెంబ్లీ స్థానాలను టిడిపి కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బిసిలకు ఉద్యోగాలు కల్పించడంలోనూ, పరిశ్రమలు తీసుకురావడంలోను వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పక్క రాష్ట్రానికి వెళ్లిపోయిన అమర్ రాజా బ్యాటరీ కంపెనియే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు.

equitas Equitas Small Finance Bank

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో ఈక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడేది)
కార్పొరేట్ ఆఫీస్: నెం. 769, స్పెన్సర్స్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్ -II, అన్న సలై, టియన్-600002.

యు/ఎస్ రూలు 8 (1) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

సెక్యూరిటీ అండ్ రీఎన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 నందు చట్టం 54) ప్రకారం మెస్సెర్స్ ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తమును, దానిపై వడ్డీతో కలిపి చెల్లించవలసినదిగా ఈ క్రింది పేర్కొనబడిన రుణగ్రహీతలను కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైంది. రుణగ్రహీతలు సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (4) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 నందలి రూలు 8 ప్రకారము క్రింద వివరించిన ఆస్తులను స్వాధీనత తీసుకోవడమైనదని ఈ క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. ముఖ్యంగా రుణగ్రహీతలు సాధారణ ప్రజానీకమును ఇందుమూలంగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల బాకీ మొత్తమునకు, వడ్డీ, ఇతర ఖర్చులు మొదలైనవి మెస్సెర్స్ ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) చట్టప్రకారం రుణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించుకోడానికి శ్రద్ధ వహించవలెను.

క్ర. సం.	రుణగ్రహీతలు/ హామీదారుల పేర్లు	సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరణ (స్థిరాస్తి)	డిమాండ్ నోటీసు తేది మరియు బకాయి	లాంఛనప్రాయ స్వాధీనతా తేది
1.	శాఖ: గుంటూరు, లోన్ ఎకౌంట్ నెం.: SEGNTUR0322510 రుణగ్రహీతలు: అల్లూరి శ్రీనివాసరాజు హామీదారులు: శ్రీమతి. అల్లూరి పరమేశ్వరరి	నరసారావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరిపేట ఎస్ఆర్ఓ, నాదెండ్ల మండలం, ఎండుగపాలెం గ్రామం మరియు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న రెసిడెన్షియల్ ఇల్లు బేరింగ్ డో.నం.1-6, పన్ను నం.6, కొలిచే: 250 చ.గజాలు. లేదా 209 చ.మీటర్లు. డో.నం.880, క్రింది విధంగా ఉన్న సరిహద్దులు: ఉత్తరం: తమ్మినేని వీరాస్వామి దొప్పలపాడిసు యొక్క ఆస్తి, దక్షిణం: కాకర్లపుడి వెంకట రామరాజు యొక్క ఆస్తి 100 అడుగులు., తూర్పు: కాకర్లపుడి బంగారు రాజు యొక్క ఆస్తి 25-00 అడుగులు., పడమర: పంచాయతీ బజార్ 20-00 అడుగులు. కొలతలు: కొలిచే 250 చ.గజాలు. లేదా 209 చ.మీటర్లు. నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా మరియు చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉంది.	31-03-2022 & Rs.1124791	08-12-2022
2.	శాఖ: గుంటూరు, లోన్ ఎకౌంట్ నెం.: SEGNTUR0323437 రుణగ్రహీతలు: శ్రీ.పల్లా గోపాలరావు హామీదారులు: శ్రీమతి. పల్లా నాగ శిరీష	గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, చేబ్రోలు ఎస్ఆర్ఓ, చేబ్రోలు మండలం, వెజెండ్ల మరియు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న రెసిడెన్షియల్ ఇంటి బేరింగ్ డో.నం.2-7, కొలిచే: 207 చ.గజాలు. లేదా 173/07 చ.మీటర్లు. డో.నం.502/ఎ1 క్రింది విధంగా ఉన్న సరిహద్దులు: ఉత్తరం: బత్తుల నాగ బాలకృష్ణ యొక్క ఆస్తి సరిహద్దు 42.3, దక్షిణం: 4.గజాల బజార్ 43.0 అడుగులు., తూర్పు: చావలి వీరాస్వామి యొక్క ఆస్తి సరిహద్దు 46-10 అడుగులు., పడమర: 6 చ.గజాల ఉమ్మడి దారి 41-5 అడుగులు. కొలతలు: కొలిచే 207 చ.గజాలు. లేదా 173/07 చ.మీటర్లు. గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా మరియు చేబ్రోలు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉంది.	29-08-2022 & Rs.1383713	08-12-2022
3.	శాఖ: శాఖ: విజయవాడ, లోన్ ఎకౌంట్ నెం.: SEVJAWD0284825 రుణగ్రహీతలు: శ్రీ. (ఎఆర్‌విఎస్. నాగరాజు) అన్నం రఘు వెంకట శివ నాగరాజు హామీదారులు: శ్రీ. అన్నం వెంకట వి. రామబ్రంహం (అన్నం)	ఆంధ్రప్రదేశ్, కృష్ణా రిజిస్ట్రేషన్ జిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, పమిడిముక్కల మండలం, కపిలేశ్వరం గ్రామ పంచాయతీ వద్ద ఉన్న రెసిడెన్షియల్ ఇంటి డో.నం.2-47 వద్ద, పన్ను నం.282, కొలిచే 330 చ.గజాలు. లేదా 280.18 చ.మీటర్లు. ఆర్.ఎస్.నం.367/19, ఉత్తరం: షేక్ నజీర్ యొక్క ఆస్తి, దక్షిణం: షేక్ సర్వీర్ సాహెబ్ మరియు ఇతరుల యొక్క ఆస్తి, తూర్పు: పంచాయతీ బజార్, పడమర: చిగులూరి గోపాలకృష్ణయ్య యొక్క ఆస్తి. కొలతలు: ఆర్.ఎస్.నం.367/19 లో కొలిచే 330 చ.గజాలు. లేదా 280.18 చ.మీటర్లు. కృష్ణా రిజిస్ట్రేషన్ జిల్లా మరియు ఉయ్యూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉంది.	21-02-2022 & Rs.1795403	08-12-2022

తేది: 11.12.2022,
ప్రదేశం : విజయవాడ.
సం/- ఆధీకృత అధికారి
ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

సంపాదకీయం

స్థిరపడ్డాకే పెళ్లి..!

'పెళ్లి చేసుకోరా నాయనా... జల్దీ పెళ్లి చేసుకోరా నాయనా.. పెళ్లి వయసు దాటనీకురా నాయనా..' అంటాడో సినీ కవి. 'ముప్పై యేళ్లొచ్చాయి... ఇంకెప్పుడు పెళ్లి చేసుకుంటావు. నీతోటి వారందరికీ అప్పుడే పిల్లలు కూడా పుట్టేశారు. అసలు పెళ్లి చేసుకునే ఉద్దేశం వుందా? లేదా? వీడికి ఈ జన్మలో పెళ్లవుతుందా? అని చూసినోళ్లంతా హేళన చేస్తున్నారంటూ... పెళ్లీడు దాటిపోతున్న పిల్లలున్న ఇంట్లో వినిపించే పెళ్లిగోల ఇది. 30వ పడిలో వున్న యువతీ యువకులను కదిలిస్తే... అప్పుడే పెళ్లా? మంచి ఉద్యోగం చెయ్యాలి... జీవితంలో స్థిరపడాలి... అప్పుడు చూద్దాం... అంటుంటారు. మూడు పదులు దాటితేనే మూడు ముళ్ల బంధం అంటూ తెగేసి చెబుతున్నారు. 'పెళ్ళీ చేసుకొని ఇల్లు చూసుకొని చల్లగ కాలం గడపాలోయ్/ ఎల్లరు సుఖము చూడాలోయ్ మీరెల్లరు హాయిగ ఉండాలోయ్' అంటాడు సినీకవి పింగళి. కానీ... ఇప్పటి యువత ఈ రోజుల్లో ఇది నడవదు అంటున్నారు. మరీ ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల్లోని వారైతే... చదువుకోసం అయిన అప్పులు తీర్చాలనో, మంచి ఇల్లు కట్టాలనో, విదేశాలకు వెళ్లాలనో కలలు కంటున్నారు. ఉద్యోగంలో చేరగానే పెళ్లి చేసుకుంటే, కెరీర్ దెబ్బతింటుందనే భయం ఎక్కువమందిలో కనిపిస్తుంది. అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారు. సమాన అవకాశాలను అందిపుచ్చుకోవాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నారు. గతంలో మాదిరిగా ఒకరిపై ఆధారపడకూడదు. తల్లిదండ్రులకు భారం కాకూడదు. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగం సంపాదించాలనే ఆత్మవిశ్వాసంతో వున్నారు. అందుకే స్థిరపడిన తర్వాతే పెళ్లి అని కరాఖండిగా చెబుతున్నారు.

'ఏ వయసు ముచ్చట ఆ వయసులో తీరాలి' అంటారు పెద్దలు. కానీ, చదువు, ఉద్యోగం, స్థిరత్వం... ఆ తర్వాతే పెళ్లి అనే భావన మొదలై చాలాకాలమే అయ్యింది. 'జాతీయ గణాంకాల సంస్థ' తాజా నివేదిక ప్రకారం... మన దేశంలో 15-29 ఏళ్ల మధ్య ఉండే యువత పెళ్లి ఆలోచనే చేయడం లేదట. దేశం మొత్తం మీద పెళ్లి కాని యువతీ యువకులు అత్యధికంగా ఉన్న జమ్ము-కాశ్మీర్, ఆ తర్వాత యు.పి, ఢిల్లీ, పంజాబు రాష్ట్రాల్లో దాదాపు 30 ఏళ్లు దాటే వరకూ పెళ్లి మాటే ఎత్తడంలేదు. వీళ్లందరి మాటా ఒక్కటే...ముందు జీవితంలో స్థిరపడాలి, తర్వాతనే పెళ్లి అని. భారత్‌లో పెళ్లిళ్ల వ్యయానికి అప్పులిచ్చే 'బెటర్ హాఫ్' సంస్థ తాజాగా ఓ సర్వే చేపట్టింది. ఈ సర్వేలో 21-35 ఏళ్ల 2100మంది అభిప్రాయాలను సేకరించింది. వారిలో 68 శాతం మంది ఆర్థికంగా స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుంటామని తేల్చి చెప్పారు. సొంత డబ్బుతోనే పెళ్లి చేసుకోవడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నామని 70 శాతం మంది యువత ఆ సర్వేలో వెల్లడించారు.

ఇప్పుడు బతుకంతా ప్రైవేటు రంగం కౌగిట్లోకి చేరిపోయింది. వ్యక్తిగత జీవితం అభద్రంగా, సామాజిక జీవితం కల్లోలంగా, భవిష్యత్తు సందిగ్ధంగా పరిణమించిన ఒకానొక సంధికాలం ఇప్పుడు నడుస్తోంది. ప్రజల జీవితాలు అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ముఖ్యంగా ఈ అభద్రతా భావం యువతను వెన్నాడుతోంది. దేశంలో నిరుద్యోగ రేటు పెరుగుతోంది. యువతలో ఉద్యోగ రేటు 2017 కంటే ఇప్పుడు సగానికి సగం తక్కువ నమోదైందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నిరుద్యోగ సైన్యం ఎంత ఎక్కువ వుంటే పెట్టుబడిదార్లకు అంత చౌకగా శ్రమశక్తి లభిస్తుంది. కనుకనే ఉపాధి కోసం ఎదురుచూసే పరిస్థితిని పాలకులు మరింతగా పెంచుతున్నారు. ఈ అభద్రతా భావ పరిస్థితే... యువతీ యువకుల ఆలోచనలను ప్రభావితం చేస్తోంది. ఉద్యోగం రావాలి, ఆర్థికంగా స్థిరపడాలి. ఆ తర్వాతే పెళ్లి అనే ధోరణి పెరుగుతోంది. ఆ అభద్రత నుంచి పుట్టిందే... ముందు స్థిరపడాలి... ఆ తర్వాతే ఏదైనా అనే ఆలోచన. కథ అయితే... కావాల్సిన చోట ఆనందాన్ని అతికించవచ్చు. వద్దనుకుంటే విషాదాన్ని తీసెయ్యవచ్చు. కానీ ఇది జీవితం... అలా కుదరదు. యువత ఆనందమయమైన వైవాహిక జీవితం గడపాలంటే... వారికి భరోసానిచ్చే ఓ వ్యవస్థ కావాలి. చదువు పూర్తికాగానే ఉపాధి కల్పించే సమున్నత వ్యవస్థ రావాలి. అలాంటి అభ్యుదయకర వ్యవస్థలోనే ఆదర్శవంతమైన నవసమాజం, స్వేచ్ఛాయుతమైన యువతరం ఆవిర్భవిస్తుంది.

మంచి మాట



పోరాటం మాత్రమే పీడిత వర్గాన్ని ఎడ్యుకేట్ చేస్తుంది. పోరాటం మాత్రమే దాని శక్తి ఏమిటో దానికి తెలియచేస్తుంది. పోరాటం మాత్రమే దాని శక్తిని విస్తతపరుస్తుంది. దాని సామర్థ్యాన్ని పెంచుతుంది. దానికి స్పష్టతనిస్తుంది. ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది.

- వి.ఐ.లెనిన్

మూడు రాష్ట్రాల ఫలితాలు చెప్పిందేమిటి?

తెలకపల్లి రవి

గుజరాత్‌లో బిజెపి సాధించిన పెద్ద విజయంతో దేశంలో మరోసారి బిజెపి మోత పెంచే ప్రయత్నం కనిపిస్తుంది. బిజెపి అనుకూల శక్తులూ, కొందరు మేధావులూ, మీడియా కూడా ప్రధాని మోడీకి జేజేలు పలికి అలిసిపోతున్నారు. ముప్పై ఏళ్ల కాలంలో అక్కడ ఎవరికీ రానన్ని స్థానాలు సాధించి ఏడోసారి పీఠమెక్కనుండటం పెద్ద విషయమే. బిజెపి ఇప్పటికీ...బెంగాల్‌లో సిపిఎం, లెఫ్ట్‌ఫ్రంట్ సాధించిన రికార్డును అధిగమించవలసే వుంది. కేంద్రంలో రెండోసారి మోడీ తిరిగివచ్చిన మాటా నిజమే. కాని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కూడా రెండోసారి ఎన్నికవడం ఇటీవలి చరిత్రే. అన్నిటినీ మించి గుజరాత్‌తో పాటు ఎన్నికలకు వెళ్లిన హిమాచల్ ప్రదేశ్‌లో మోడీ మ్యాజిక్ పనిచేయలేదు. ఒకనాటి కంచుకోట లాంటి ఢిల్లీలో పదిహేనేళ్లుగా ఏలుతున్న నగరపాలక సంస్థ చేజారిపోయింది. వీటితో పాటు జరిగిన ఉప ఎన్నికలలోనూ బిజెపి వ్యతిరేకుల విజయాలే ఎక్కువ. మూడు చోట్ల మూడు రకాల ఫలితాలు వచ్చినా గుజరాత్‌నే లెక్కలోకి తీసుకుని మోడీ 2024లో రాబోతున్నారన్నట్టు చిత్రించడం మైండ్‌గేమ్ అనుకోవాలి. నిజానికి ఎగ్జిట్ పోల్స్ ముందైనా ఏ దశలోనూ గుజరాత్‌లో బిజెపి ఓడిపోతుందని ఎవరూ అనుకోలేదు. ప్రధాన ప్రతిపక్షంగా వున్న కాంగ్రెస్ మరీ ముఖ్యంగా దాని అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో గుజరాత్‌ను లైట్ తీసుకున్నప్పుడే వారి అంచనా అర్థమైంది. ఆమ్ ఆద్మీ పార్టీ అన్ని చోట్లా పోటీ పెడతానని ప్రకటించినప్పుడే ఓట్ల చీలిక బిజెపికే మేలు చేస్తుందని ఖాయమైంది. మరో వైపున ఏడాది ముందునుంచే మోడీ గుజరాత్ ప్రధాని అవతారమెత్తారు. గుజరాత్ అస్మిత, గుజరాతీ ఆత్మగౌరవం నినాదాలెత్తుకున్నారు. అయినా వాస్తవంగా తమ పరిస్థితి తెలుసు గనక చివరి నిముషంలో ముఖ్యమంత్రి విజయ్ రూపానీని మార్చి భూపేంద్ర పటేల్‌ను తెచ్చారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ ఎంఎల్‌ఎలనూ సామాజిక వర్గాల నేతలనూ చేర్చుకుంటూ వచ్చారు. హార్దిక్ పటేల్, అల్పేష్ ఠాకూర్ తదితరుల జాబితా చాలా పెద్దది. తమ వాళ్లలో మూడో వంతు మంది అభ్యర్థులనూ మార్చారు.

పాచికల ప్రయోగం, విద్వేష విహారం

బిజెపికి రెండు మూల స్తంభాల్లాంటి హిందూత్వ వ్యూహాలు, కార్పొరేట్ శక్తుల నిధుల వానలు అత్యధిక స్థాయిలో నడిచాయి. ఎన్నికల బాండ్ల విడుదల సమయం మార్చి ప్రత్యేకంగా ఒక వారం అవకాశమిచ్చారు. చేతులెత్తేసిన కాంగ్రెస్, ఓట్లు చీల్చడానికి సిద్ధంగా ఆప్ వుంటే బిజెపి నేతలు సామదాన భేద దండోపాయాలను ప్రయోగించారు. 2002లో గోద్రా ఘటనలకు ప్రతీకారం తీర్చుకున్నామని సాక్షాత్తూ హోంమంత్రి అమిత్ షా వచ్చి చెప్పారు. కాంగ్రెస్ నేతల ప్రచారాలకు సమాధానమంటూ రాముడినీ ఎన్నికల ప్రచారంలో దింపారు. గత ఇరవై ఏళ్లలోనూ మారుమూల వాడలలో బెరుకు బెరుకుగా బతుకున్న ముస్లిం బాహుళ్యాన్ని పూర్తి భయోత్పాతానికి గురిచేశారు. ఒక్క ముస్లిం అభ్యర్థినీ నిలబెట్టలేదు. ఎన్నికలకు ముందే కేంద్ర రాష్ట్రాలు కూడబలుక్కుని బిల్కిస్ బానో సామూహిక అత్యాచారం కేసు నిందితులను విడుదల చేశారు. కేంద్రం ఈ కాలంలో లక్షా ముప్పై వేల కోట్లు గుజరాత్‌కే కేటాయించింది. దీర్ఘకాల పునాది, అధికార బలం, విస్తారమైన ఎన్నికల యంత్రాంగం, ప్రధాని హోంమంత్రి మార్గనిర్దేశం కలిశాక 156కు చేరడంలో ఆశ్చర్యం ఏముంది? ఉదాహరణకు సౌరాష్ట్రలో తాము బలహీనం గనక కాంగ్రెస్ నుంచి చేరిన ఇరవై మందికి అక్కడే టికెట్లిచ్చి గెలిపించుకున్నారు. ఆప్ ఓట్ల చీలిక కారణంగా మరో ఇరవై స్థానాల దాకా తెచ్చుకున్నారు. ఫలితంగా కాంగ్రెస్ గతసారి వచ్చిన 77 స్థానాల బదులు ఇప్పుడు 17 స్థానాలు, 40 శాతం ఓట్ల బదులు 26 శాతం మాత్రమే తెచ్చుకోగలిగింది. 188 చోట్ల పోటీ చేసిన ఆప్ అయిదు స్థానాలకే పరిమితమైనా 13 శాతం ఓట్లు తెచ్చుకుని జాతీయ పార్టీగా మారింది. దానివల్ల బిజెపికి యాభై స్థానాలు అదనంగా వచ్చాయి. ఎన్నికల్లో ఎవరైనా ఎత్తులు పైఎత్తులు వేస్తారు కదా అని ఎదురు ప్రశ్నరావచ్చు. మత రాజకీయాలు, కార్పొరేట్ వత్తాసు, కేంద్ర నిధుల గుమ్మరింతలో పక్షపాతం రాజ్యాంగబద్ధమేనా?

సంక్షేమానికీ అభివృద్ధికీ పోటీనా?

గుజరాత్‌లో మంచి పాలనకే ఓటు వేశారనీ, సంక్షేమం అభివృద్ధి మధ్య పోటీ అని అమిత్ షా దీన్ని వర్ణించారు. ఉచితాలకు గుణపాఠం చెప్పామన్నారు. మాతో పాటు మీడియా చర్చలలో పాల్గొన్న మేధావులు కొందరు ఇదే వాదన నెత్తినెత్తుకోవడం ఆశ్చర్యం కలిగించింది. కేంద్ర రాష్ట్ర పథకాలను ఎన్నికలలో గొప్పగా ప్రచారం చేసుకోవడమే గాక కొత్త వాగ్దానాలు కూడా చేశారని ఇంగ్లీషు పత్రికలు రాశాయి.

హిందూత్వ పేర దాడులు, విషప్రచారాలు సరేసరి. అయితే ఆప్, కాంగ్రెస్ లకు తమ తమ స్థానాన్ని కాపాడుకోవడం తప్ప బిజెపిని ఓడించడం లక్ష్యంగా లేదు. కనుకనే అన్ని చోట్లా పోటీ పడి రాష్ట్రాన్ని ఆ పార్టీకి సమర్పణ చేశారు. ఇప్పటికీ మతతత్వ రాజకీయాలు, నిరంకుశ పోకడల గురించి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సూటిగా మాట్లాడింది లేదు. తమకు రాజకీయాల కన్నా ప్రజల సమస్యలే ముఖ్యమని అంటుంటారు. ఆప్ పోటీ కాంగ్రెస్ స్థానాన్ని కైవశం చేసుకోవడానికి తప్ప తమపైన కాదని బిజెపి నేతలు కుండబద్దలు కొట్టి చెబుతున్నారు. ఇలాగే అన్ని చోట్ల ఆ పార్టీ పోటీలో వుండాలని కోరుకుంటున్నారు. ఏతావాతా గుజరాత్ ఎన్నికలు లౌకిక శక్తుల ఓట్ల చీలిక వల్ల కలిగే ముప్పు గురించి హెచ్చరిస్తున్నాయి. యు.పి లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీల మధ్య ఓట్ల చీలిక ఇలాగే బిజెపి నెత్తిన పాలుపోసిందని గుర్తుంచుకోవాలి.

వాస్తవానికి గుజరాత్‌లో గత ఐదేళ్ల పాలన చాలా కాలంగా ఘోరంగా నడిచింది గనక చివరి దశలోలో ముఖ్యమంత్రిని మార్చారు. 1960లో రాష్ట్రంగా ఏర్పడక ముందు నుంచి గుజరాత్ సంపన్న పారిశ్రామిక ప్రాంతం. అయితే బిజెపి పాలనతో రాష్ట్రం సామాజిక సూచికల్లో దారుణంగా వెనకబడి వుంది. జాతీయ సగటు వేతనం, ఆయుర్దాయం, ఉపాధి కల్పన, కార్మిక భద్రత వంటివన్నీ అక్కడ దిగువనే వున్నాయి. కరోనాలో లక్షమంది ప్రాణాలు కోల్పోయిన రాష్ట్రమది. 87 వేల మందికిపైగా మరణించారని ఆ ప్రభుత్వం సుప్రీంకోర్టులో చెప్పింది. మోర్బీలో వంతెన కూలి 135 మంది మరణించడం దేశాన్ని కలవరపర్చింది. గిరిజనుల ఉపాధికి గండిపడింది. గుజరాత్, మహారాష్ట్రల మధ్య నర్మద, పర్, తపి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై జరిగిన ఆందోళన ఫలితంగా ప్రభుత్వం దాన్ని వదలివేసుకుంది. గో రక్షణ ముసుగులో ఆమోదించిన బిల్లు విస్తారమైన పశువుల కాపరుల ఆందోళన వల్ల ఆఖరి రోజున ఉపసంహరించుకోవలసి వచ్చింది. పైన చెప్పినట్టు సామాజిక వర్గాల నాయకులుగా ముందుకొచ్చిన యువనేతల ఆందోళన ఒక దశలో తీవ్ర సవాలు విసిరింది. జీతభత్యాలు ఉద్యోగ భద్రత కోసం ప్రభుత్వోద్యోగులు అనేక ఆందోళనలు చేశారు. రైతాంగ సమస్యల తీవ్రతపై వారికి అనుకూలమైన భారతీయ కిసాన్ యూనియన్ కూడా ఉద్యమించవలసి వచ్చింది. హిందూత్వ పేర దాడులు, విషప్రచారాలు సరేసరి. అయితే ఆప్, కాంగ్రెస్ లకు తమ తమ స్థానాన్ని కాపాడుకోవడం తప్ప బిజెపిని ఓడించడం లక్ష్యంగా లేదు. కనుకనే అన్ని చోట్లా పోటీ పడి రాష్ట్రాన్ని ఆ పార్టీకి సమర్పణ చేశారు. ఇప్పటికీ మతతత్వ రాజకీయాలు, నిరంకుశ పోకడల గురించి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సూటిగా మాట్లాడింది లేదు. తమకు రాజకీయాల కన్నా ప్రజల సమస్యలే ముఖ్యమని అంటుంటారు. ఆప్ పోటీ కాంగ్రెస్ స్థానాన్ని కైవశం చేసుకోవడానికి తప్ప తమపైన కాదని బిజెపి నేతలు కుండబద్దలు కొట్టి చెబుతున్నారు. ఇలాగే అన్ని చోట్ల ఆ పార్టీ పోటీలో వుండాలని కోరుకుంటున్నారు. ఏతావాతా గుజరాత్ ఎన్నికలు లౌకిక శక్తుల ఓట్ల చీలిక వల్ల కలిగే ముప్పు గురించి హెచ్చరిస్తున్నాయి. యు.పి లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీల మధ్య ఓట్ల చీలిక ఇలాగే బిజెపి నెత్తిన పాలుపోసిందని గుర్తుంచుకోవాలి.

హిమాచల్ తీర్పు

ఇదే సమయంలో జరిగిన హిమాచల్ ప్రదేశ్ చిన్న రాష్ట్రమైనా కాంగ్రెస్ గెలుపు ఏకపక్ష నిర్ధారణలకు పగ్గాలు వేసింది. ప్రతి ఎన్నికల్లో ప్రభుత్వం మారే ఆనవాయితీ అక్కడ వున్నా ఈ సారి మార్చేస్తామని (రివాజ్ బదలే) బిజెపి గొప్పలు పోయి భంగపడింది. ఆ పార్టీ అధ్యక్షుడైన నడ్డా స్వరాష్ట్రంలో శాంతకుమార్, ప్రేమ్ కుమార్ ధమాల్ వంటివారు మోడీకి భిన్నంగా వాజ్‌పేయి తరహాలో ప్రచ్ఛన్న రాజకీయాలనే అమలు చేస్తూ వచ్చారు. కాశ్మీరియత్ అన్నట్టు హిమాచలియత్ అంటూ స్థానికాంశాలపైనే పోటీ సాగిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు దిగిపోతున్న ముఖ్యమంత్రి జైరామ్ ఠాగూర్ ఆరెస్సెస్ నేపథ్యంలో అచ్చంగా ఆ ఎజెండానే నెత్తినెత్తుకున్నారు. రాష్ట్రంలో అవినీతి బెడద, అగ్నిపథ్‌పై అలజడి, రైతాంగం ముఖ్యంగా యాపిల్ రైతుల సమస్యల వంటివి తీవ్ర ప్రభావం చూపించాయి. గుజరాత్‌ను పూర్తిగా వదలేసిన కాంగ్రెస్ హిమాచల్‌లో మాత్రం ప్రియాంకను ప్రచారానికి తీసుకొచ్చింది. ఒక దశలో పోటాపోటీగా కనిపించినా చివరకు కాంగ్రెస్ మంచి అధిక్యతతో గెలవగలిగింది. ఆప్ ప్రభావం నామమాత్రమే అయింది. 68 మంది సభ్యులున్న అసెంబ్లీలో 40 గెల్చుకున్న కాంగ్రెస్ వారిని మరోచోటికి తరలించాల్సి రావడం అభద్రతనే గాక బిజెపి తరహా కుటిల రాజకీయాలను కూడా చెబుతుంది.

ఢిల్లీ కార్పొరేషన్ డిటో

ఈ ఫలితాలకు ఒక రోజు ముందే వచ్చిన ఢిల్లీ మునిసిపల్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలలో ఆప్ తొలిసారి ఘన విజయం సాధించింది. సంప్రదాయికంగా బిజెపికి ఢిల్లీ కంచుకోట. షీలా దీక్షిత్ మూడుసార్లు గెలిచిన నేపథ్యంలో వారు ఢిల్లీ అసెంబ్లీని కోల్పోయారు. తర్వాత నుంచి ఆప్ హవా సాగుతున్నది. అయితే మునిసిపల్ కౌన్సిల్ మాత్రం వారి ఆధ్వర్యంలోనే వుంటుంది. అదీ చేజారిపోయింది. కేంద్ర మంత్రులు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఢిల్లీలో ప్రచారం చేసినా ప్రయోజనం లేకపోయింది. ఢిల్లీ ప్రభుత్వం కన్నా ఈ మునిసిపాలిటీకే ఎక్కువ అధికారాలు, నిధులు వుండటం ఆప్‌కు కలిసివచ్చే అంశం.

ఈ సందర్భంగా ఉప ఎన్నికలు జరిగిన యు.పి, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, రాజస్థాన్ లలోనూ బిజెపి ఓడిపోయింది. బీహార్, యు.పిలో ఒకటి మాత్రమే గెలిచింది.

రాష్ట్రాలవారీ వ్యూహాలు

గతంలో కాంగ్రెస్ గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టడం గాని బిజెపిని నిలవరించం గాని వామపక్షాలు, లౌకిక పార్టీల ఉమ్మడి పోరాటంతోనే సాధ్యమైంది. ఈ దేశంలో బహుళత్వం ప్రధానమైంది. బిజెపిని పాన్ ఇండియా పార్టీగా చిత్రిస్తున్నా అందులో పెద్దవి యు.పి, గుజరాత్. సుమారైనవి అస్సాం, త్రిపుర మాత్రమే. సిక్కిం, నాగాలాండ్, మేఘాలయ, మణిపూర్, గోవా, అరుణాచల్ ప్రదేశ్ చిన్నవి. మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర లాంటివి ఎలాగో ఫిరాయింపుదార్లతో నెట్టుకువస్తుంది. తమిళనాడు, ఎ.పి, తెలంగాణ, బెంగాల్, ఒరిస్సా, బీహార్, పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కేరళ వంటి అనేకం ఇతర పక్షాల పాలనలో వున్నాయి. బిజెపి అనుసరించే హిందూత్వ మత రాజకీయాలు అదానీ, అంబానీ కార్పొరేట్ విధానాలు తీవ్ర సవాలుగానే వున్నాయనడంలో సందేహం లేదు. పైగా ఇప్పుడు గుజరాత్ విజయాన్నీ రాబోయే జి20 అధ్యక్షత ప్రచారాన్ని కలగలిపి పెద్దఎత్తునే హడావుడి మొదలైపోయింది. బిజెపి కూటమి దాడిని ఎదుర్కొంటూనే విస్తారమైన ఈ లౌకిక ప్రజాస్వామిక శక్తుల పట్టును పెంచుకోవడం, మతతత్వ రాజకీయాలపై ఏకోన్ముఖ పోరాటంగా మలచడం ఈ ఎన్నికలు ఇస్తున్న గుణపాఠం. ఆయా రాష్ట్రాలకు తగిన ఎత్తుగడలు అనుసరిస్తూ లౌకిక పార్టీలు ఆ కర్తవ్యాన్ని నిర్వహించాలి. 2023 పొడుగునా జరిగే వివిధ ఎన్నికలలో ఆ విధంగా బిజెపిని ఎదుర్కోవలసి వుంటుంది. అంతిమంగా 2024 ఎన్నికల పోరాటం జరుగుతుంది. ఇలాంటి సమయంలో ఎ.పిలో మూడు ప్రాంతీయ పార్టీలు బిజెపి చుట్టూ తిరుగుతుంటే టిఆర్‌ఎస్ బీఆర్‌ఎస్ గా మారి బిజెపి తో తలపడుతానంటోంది. కాంగ్రెస్ పునరుద్ధరణకు పెనుగులాడుతుంటే వామపక్షాలు బిజెపి పై రాజీ లేని పోరాటం చేస్తున్నాయి. ★

కామెంట్

విద్యా రంగంలో మతోన్మాద పోకడలు

ఈ కాషాయీకరణ చర్యల ప్రభావం మైనారిటీ ముస్లిం టీచర్లు, విద్యార్థులపై పడుతోంది. వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. కర్ణాటక లోని ప్రభుత్వ కాలేజీల్లో హిజాబ్‌లు ధరించిన విద్యార్థినులు ప్రవేశించకుండా నిషేధించడం, అలాగే మధ్యప్రదేశ్ లోని ప్రభుత్వ లా కాలేజీలో ముస్లిం టీచర్లను డిబార్ చేయడం, పైగా వారిపై క్రిమినల్ అభియోగాలు మోపడం...వంటివన్నీ కూడా బిజెపి పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా జరుగుతున్నాయనేది సుస్పష్టం.

ఇండోర్‌లో గవర్నమెంట్ న్యూ లా కాలేజ్, మరికొన్ని చోట్ల జరిగిన సంఘటనలు ఆందోళన కలిగించేవిగా వున్నాయి. సమాజంలో తీవ్రంగా పాతుకుపోయిన మతోన్మాద పోకడలు, ధోరణులు ప్రస్తుతం విద్యా వ్యవస్థను ఏ విధంగా దెబ్బ తీస్తున్నాయనడానికి ఇవి ఉదాహరణలుగా వున్నాయి.

ఇండోర్‌లోని గవర్నమెంట్ న్యూ లా కాలేజ్‌లో అత్యంత అధ్వాన్నమైన సంఘటన చోటు చేసుకుంది. బోధనా ఫ్యాకల్టీలో ముస్లిం మత ప్రక్షాళన చేసే కార్యక్రమంగా దీన్ని పిలవవచ్చు. కాలేజీ లోని నలుగురు ముస్లిం ఉపాధ్యాయులు మతపరమైన ఛాందసవాద ఆలోచనా ధోరణిని పెంచి పోషిస్తున్నారంటూ కాలేజీలోని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) శాఖ ఆరోపిస్తూ నిరసనలు చేపట్టింది. పైగా కాలేజీలో ముస్లిం ఫ్యాకల్టీ సభ్యులు ఎక్కువమంది వుండడాన్ని కూడా వారు ప్రశ్నించారు. వాస్తవానికి, మొత్తంగా 28 మంది టీచర్లు వుంటే కేవలం నలుగురు మాత్రమే ముస్లింలు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

కాలేజీ కేంపస్‌లో ముస్లిం, ఇస్లామిక్ సంస్కృతీ సాంప్రదాయాలను పెంచి పోషిస్తున్నారంటూ ముస్లిం టీచర్లపై ఆరోపణలతో ఎబివిపి శాఖ అధ్యక్షుడు ఒక మెమోరాండం కూడా సమర్పించారు. ఈ టీచర్లు విద్యార్థినులను రెస్టారెంట్లకు, పబ్‌లకు తీసుకెళుతూ లవ్ జిహాద్‌ను కూడా పెంపొందిస్తున్నారని వారు ఆరోపించారు. ఫిర్యాదులు చేయబడిన నలుగురు ముస్లిం టీచర్లు, మరో ఇద్దరిని కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఇనమూర్ రహమాన్ ఐదు రోజుల పాటు బోధనా బాధ్యతల నుండి తొలగించారు. రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తిచే విచారణకు ఆదేశించారు. ఇంత చేసిన ఆయన కూడా ముస్లిమే.

కానీ, ఈ చర్యతో సంతృప్తి చెందని ఎబివిపి విద్యార్థులు కొత్త అభియోగాలు మోపారు. డాక్టర్ ఫర్హాత్ ఖాన్ రాసిన 'కలెక్టివ్ వయొలెన్స్ అండ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్' అనే పుస్తకాన్ని కాలేజీ లైబ్రరీలో వుంచారని వారు ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్, హిందువుల గురించి ఆ పుస్తకంలో వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని వారు చెప్పారు. 2019లో తాను ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించగా, 2014 లోనే ఈ పుస్తకాన్ని లైబ్రరీలో పెట్టారని ప్రిన్సిపల్ వివరణ ఇచ్చారు. అయినా, ఆందోళనకారులు ఆయననే లక్ష్యంగా చేసుకుని తమ నిరసనలు కొనసాగించారు. అంతిమంగా ఆయన రాజీనామా చేసేలా ఒత్తిడి తెచ్చారు.

ఎబివిపి విద్యార్థులు చేసే ఆందోళనకు, వారి ఫిర్యాదులకు రాష్ట్ర హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా మద్దతు పలికారు. వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులను ఆదేశించారు. ప్రిన్సిపల్, మరో టీచర్ మీర్జా మోజిజ్, పుస్తకం రచయిత, ప్రచురణకర్తలపై ఐపిసి లోని వివిధ సెక్షన్ల కింద స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు. సెక్షన్ 153-ఎ (రెండు గ్రూపుల మధ్య శతృత్వాన్ని పెంచి పోషించడం), 295-ఎ (ఒక గ్రూపు మతపరమైన భావాలను రెచ్చగొట్టేందుకు ఉద్దేశ్యపూర్వక, తప్పుడు చర్యలు చేపట్టడం) వంటి సెక్షన్లపై కూడా కేసులు నమోదయ్యాయి.

రచయిత డాక్టర్ ఫర్హాత్ ఖాన్‌ను, మరో ముగ్గురిని అరెస్టు చేయడానికి పోలీసులు చూస్తున్నారు. ఆ ముగ్గురికి ముందస్తు బెయిల్ ఇవ్వడానికి జిల్లా కోర్టు తిరస్కరించడంతో మాజీ ప్రిన్సిపల్ సహా ముగ్గురిని అరెస్టు చేసే అవకాశం వుంది.

ఆ రకంగా, కొద్ది రోజుల్లోనే, ప్రిన్సిపల్‌తో సహా ముస్లిం టీచర్లందరినీ వారి పదవుల నుండి తొలగించారు. పైగా రాష్ట్ర ప్రభుత్వం తన మౌనంతోనే ఈ చర్యకు అంగీకారం తెలిపింది. ఎబివిపి శాఖ లేవనెత్తిన ఫిర్యాదుల ఆధారంగా ఉన్నత విద్య డైరెక్టరేట్ ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. మత తీవ్రవాదం, ఇంకా ఇటువంటి ఇతర అభియోగాలపై ఈ కమిటీ దర్యాప్తు జరుపుతుంది.

ఇలా మైనారిటీ టీచర్లను లక్ష్యంగా చేసుకున్న సంఘటనలు బిజెపి పాలిత మధ్య ప్రదేశ్‌లో ఇంకా చాలా వున్నాయి. విదిష లోని ఒక స్కూల్ ముస్లిం ప్రిన్సిపల్ షాయినా ఫిర్దోస్‌ను ఈ ఏడాది అక్టోబరులో తొలగించారు. ఆమెపై బజరంగ్ దళ్ సభ్యులు వివిధ ఆరోపణలు చేశారు. ఒక విద్యార్థి ఫిర్యాదు ఇచ్చారని పేర్కొంటూ, గుణ జిల్లాలో మరో క్రైస్తవ మిషనరీలో ఇద్దరు టీచర్లు జస్టిన్, జాస్మిన్ ఖతూన్‌లపై ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ముస్లిం విద్యార్థులు లేదా టీచర్లపై ప్రదర్శిస్తున్న మతోన్మాద సంఘటనలు ఇతర రాష్ట్రాల్లో కూడా వెలుగు చూశాయి. ఇటీవలే, కర్ణాటక లోని మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ముస్లిం విద్యార్థి పేరు కసబ్ అయినందుకు ఆ కాలేజీ ప్రొఫెసర్ ఆ విద్యార్థిని అపహాస్యం చేసేలా వ్యాఖ్యలు చేశారు. రాజస్థాన్ లోని బర్మార్‌లో ఒక క్లాస్ టీచర్ ఏకైక ముస్లిం విద్యార్థినిపై దాడి చేసి ఆమెపై ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలు చేశాడు. ఆ విద్యార్థి ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఆ సంబంధిత టీచర్‌పై ఎలాంటి చర్య తీసుకోలేదు.

విలువలతో కూడిన విద్యను నేర్పాలన్న సాకుతో నూతన విద్యా విధానం ద్వారా విద్యా వ్యవస్థలో మతోన్మాదాన్ని చొప్పించడమనేది మోడీ ప్రభుత్వ లక్ష్యాల్లో ఒకటి. అయితే, ఈ కాషాయీకరణ చర్యల ప్రభావం మైనారిటీ ముస్లిం టీచర్లు, విద్యార్థులపై పడుతోంది. వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. కర్ణాటక లోని ప్రభుత్వ కాలేజీల్లో హిజాబ్‌లు ధరించిన విద్యార్థినులు ప్రవేశించకుండా నిషేధించడం, అలాగే మధ్యప్రదేశ్ లోని ప్రభుత్వ లా కాలేజీలో ముస్లిం టీచర్లను డిబార్ చేయడం, పైగా వారిపై క్రిమినల్ అభియోగాలు మోపడం...వంటివన్నీ కూడా బిజెపి పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా జరుగుతున్నాయనేది సుస్పష్టం. ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా కుదించడమనేది ప్రభుత్వ విద్యా వ్యవస్థలోనూ ప్రతిబింబిస్తోంది.

'ఒక భూగోళం, ఒక కుటుంబం, ఒక భవిష్యత్' అనే నినాదంతో అధికారికంగా వచ్చే ఏడాదికి జి-20 అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టింది. వసుధైక కుటుంబంలో సామరస్యతను పెంచి పోషించడానికి భారత్ బాసటగా వుందని ప్రధాని మోడీ చాలా ఆర్భాటంగా వ్యాఖ్యానించారు. కానీ మరోపక్క దేశంలో మాత్రం వర్గ, మత దృక్పథంతో భారతీయ కుటుంబాన్ని విభజించడానికి జరగాల్సినదంతా జరుగుతోంది.

దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వివిధ నగరాల్లో జి-20 కి సంబంధించిన పలు సమావేశాలు, సభలను ప్రభుత్వం ప్రకటించింది. అందులో ఒక జి-20 సమావేశం ఇండోర్‌లో జరగనుంది.

స్టాండప్ కమెడియన్ మున్వర్ ఫరూకిని ఈ నగరంలోనే అరెస్టు చేశారు. ఆయనిచ్చే ప్రదర్శనలు హిందువుల సున్నితమైన మత మనోభావాలను దెబ్బతీస్తున్నాయంటూ హిందూత్వ సంస్థ ఇచ్చిన ఫిర్యాదు కారణంగా ఈ అరెస్టు జరిగింది. హిందువుల ప్రాంతాల్లో గాజులు అమ్ముతున్నందుకుగాను తస్లీం అలీ అనే గాజుల వ్యాపారిని గతేడాది ఇదే ఇండోర్‌లో అరెస్టు చేశారు. అలా అరెస్టయి జైల్లో 107 రోజులు గడిపాడు. కేవలం ముస్లింలు అయినందున గౌరవనీయులైన న్యాయ కోవిదులు, మేధావులు, ఉపాధ్యాయులను వెంటాడిన నగరం ఇది.

ఇండోర్‌లో జి-20 కార్యక్రమం జరిగినపుడు... హిందూత్వ పాలన నిజ స్వరూపం, వసుధైక కుటుంబం అంటూ చేసిన కపట ప్రకటన బట్టబయలవుతుంది.

/'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం/

జనవాక్యం

అది అసలు ఎత్తు

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళయిందని 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ 'పేరిట బిజెపి చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. స్వాతంత్ర్య దినోత్సవం ఆగష్టు 15కు ముందు, వారం తర్వాత వారం రోజులపాటు 'ఘర్ ఘర్ తిరంగా' పేరుబెట్టి, ప్రతి ఇంటి మీద, కార్యాలయాలపైనా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ప్రచారం చేసి రకరకాల ఫోజులతో మోడీ ప్రజలకు పిలుపునిచ్చారు. టీవీల్లో పాటలు, పత్రికల్లో కథనాలు, మీడియాల్లో చర్చలు!! రాజ్యాంగ సూత్రాలను, జాతీయ పతాక ఆవిష్కరణ, అవనతం నిబంధనలన్నిటినీ తుంగలోకి తొక్కి మరీ చిందులు వేశారు స్వాతంత్ర్య దినోత్సవం దాకా! తర్వాతి రోజు నుండి ఆవిష్కరించిన జాతీయ పతాకాన్ని సాయంత్రం ఆరు గంటలోపు తొలగించడం, వర్షానికి తడవనీయకుండడం, నేల మీద పడనీయకుండటం...లాంటి నిబంధనలను కేంద్రం పట్టించుకోనేలేదు! ఇప్పుడు వీధుల్లో నలిగిన, చినిగిన, ఇళ్లపై వర్షానికి తడిసి కన్నీరు కారుస్తున్నట్లు జాతీయ పతాకాల స్థితి! అమృత మహోత్సవాలంటే ఇంటింటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడమేనా? బిజెపి వేసే చిందులకు అసలైన అర్థం తెలియనివారికి, తెల్సినా హిందూత్వ మతోన్మాద భావజాలంలో నిండా మునిగిపోయినవారికి ఇవేవీ పట్టడం లేదు. 2024 ఎన్నికల్లో ప్రయోజనం పొందడమే బిజెపి ఏకైక లక్ష్యం! బుజ్జగించో భయపెట్టో డబ్బో, మద్యమో, అయోధ్య రామ మందిరమో, మధుర కష్ణ మందిరమో చూపి ఓట్ల బ్యాంకులను కొల్లగొట్టడమే బిజెపి ఎత్తుగడ!

- చాకలకొండ శారద, కావలి, నెల్లూరు జిల్లా.

కాస్టిల్లో అరెస్టును నిరసిస్తూ పెరూలో నిరసనలు

లిమా : పెరూ వామపక్ష నేత, మాజీ అధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లోను అధ్యక్ష పదవి నుంచి తొలగించి, జైలులో పెట్టడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని, రాజ్యాంగ పరిషత్‌ను సమావేశపరచాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన నిరసన ప్రదర్శనలపై పోలీసులు కాల్పులు, లాఠీచార్జి చేశారు. లిమాలో పోలీసుల దాడిలో ఒకరు మరణించినట్లు సమాచారం. బుధవారం జరిగిన ఎన్నికలలో విజయం సాధించిన తర్వాత మితవాద-ఆధిపత్య పార్లమెంటు అధ్యక్షుడు కాస్టిల్లోను అధ్యక్ష పదవి నుంచి తొలగించింది. వైస్ ప్రెసిడెంట్ డినా బోలువర్ట్‌ను కొత్త అధ్యక్షురాలుగా నియమించింది. అధ్యక్ష పదవి నుంచి తొలగించిన అనంతరం ఆయన మెక్సికోలో రాజకీయ ఆశ్రయం కోరారు. మెక్సికన్ రాయబార కార్యాలయంలో కాస్టిల్లో అభ్యర్థన అందిందని విదేశాంగ మంత్రి మార్సెలో ఎబ్రాడ్ ధ్రువీకరించారు. అభ్యర్థన మేరకు పెరూతో దౌత్యపరమైన చర్చలు కూడా జరిగాయన్నారు.

సంక్షేమ చర్యలు చేపట్టాలి

- టైమ్ స్కేల్ పే అమలు చేయాలి
- అంగన్‌వాడీ ఉద్యోగుల జాతీయ మహాసభ డిమాండ్
- కేంద్రం ఉదాసీన వైఖరిపై పోరాటాలు ఉధృతం చేయాలని నిర్ణయం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా పిల్లల్లో పోషకాహార లోపం పెరుగుతోందని, వారి కోసం బడ్జెట్ కేటాయింపులో కేంద్రప్రభుత్వ ఉదాసీన వైఖరికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఎఐఎఫ్‌ఎడబ్ల్యుహెచ్) జాతీయ మహాసభ నిర్ణయించింది. వర్కర్లకు, హెల్పర్లకు టైమ్‌స్కేల్ వేతనాలు అమలు చేయాలని ఫెడరేషన్ డిమాండ్ చేసింది. దేశంలో మహిళలు, శిశు అభివృద్ధి కోసం బడ్జెట్ కేటాయింపులలో తీవ్ర కోత వల్ల ఆరు నెలల లోపు శిశువుల మరణాలు పెరుగుతున్నాయని సంస్థ తెలిపింది. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఐసిడిఎస్)లో పని చేస్తున్న కార్మికులపై జరుగుతున్న దోపిడీని కార్మికులు, హెల్పర్లు తప్పుబట్టారు.

దేశవ్యాప్తంగా అంగన్వాడీల్లో దాదాపు 13 లక్షల మంది వర్కర్లు, 11 లక్షల మంది హెల్పర్లు, 34 వేల మంది సూపర్‌వైజర్లు ఉన్నారు. కేంద్రం కార్మికులకు నెలకు రూ.4,500, హెల్పర్లకు రూ. 2,500 చెల్లిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు జీతం లేదా గౌరవ వేతనంగా మరికొంత చెల్లిస్తున్నాయి.

డిసెంబరు 6-9 వరకు మధురైలో జరిగిన ఎఐఎఫ్‌ఎడబ్ల్యుహెచ్ 10వ జాతీయ మహా సభ, ఉద్యోగ క్రమబద్ధీకరణ, మెరుగైన పని పరిస్థితులు, పెరుగుతున్న పని భారం, ఉద్యోగ విరమణ హక్కులతో సహా ఇతర హక్కులను సాధించుకోవటానికి పోరాటాలు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ సదస్సును సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రారంభించారు.

మహాసభకు హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు (ఫైల్)

అంగన్వాడీల పట్ల మోడీ సర్కారు వివక్ష

బడ్జెట్ కేటాయింపులు, వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు తగ్గించటం ద్వారా దేశంలోని అంగన్వాడీలను బిజెపి సర్కారు నాశనం చేస్తున్నదని ఎఐఎఫ్‌ఎడబ్ల్యుహెచ్ విమర్శించింది. దేశ పిల్లల అవసరాలను కేంద్రం చిన్న చూపు చూస్తున్నదని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు చెప్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పిల్లల కోసం బడ్జెట్ కేటాయింపుల వాటా మొత్తం బడ్జెట్‌లో దాదాపు 2.35 శాతమే. ఇది గత 11 ఏళ్లలో కనిష్ట స్థాయి కావటం గమనార్హం. "పిల్లల పౌష్టికాహారాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పోషణ్ అభియాన్, పోషణ్ ట్రాకర్‌లపై పెద్ద ఎత్తున వాదనలు చేస్తోంది. కానీ, తక్కువ కేటాయింపుల కారణంగా పిల్లలకు పోషకాహారం అందటం లేదు" అని సింధు చెప్పారు. కార్మికులందరికీ టైమ్‌స్కేల్ రూ.26 వేలు చెల్లించి క్రమబద్ధీకరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సదస్సు డిమాండ్ చేసింది.

కేంద్రం ప్రతిపాదించిన లేబర్‌కోడ్‌లపై సదస్సులో ఒక తీర్మానాన్ని చేశారు. లేబర్‌కోడ్‌లో అంగన్వాడీ కార్యకర్తలను కార్మికులుగా గుర్తించటం లేదని, కనీస వేతనాల చెల్లింపు గురించి పేర్కొనలేదని తీర్మానంలో వివరించారు. మినీ అంగన్వాడీలను పూర్తి స్థాయి అంగన్వాడీలుగా అప్‌గ్రేడ్ చేయాలని సదస్సు డిమాండ్ చేసింది. సదస్సుకు పలు రాష్ట్ర సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 650 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ర్యాలీ, బహిరంగ సభలో 20 వేల మందికి పైగా పాల్గొన్నారు. ఫెడరేషన్ అధ్యక్షురాలిగా ఉషారాణి, ప్రధాన కార్యదర్శిగా సింధును సమావేశం ఎన్నుకున్నది.

హిమాచల్‌ప్రదేశ్ సిఎంగా సుఖ్విందర్ సింగ్

షిమ్లా : హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆ రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుఖ్విందర్ సింగ్ సుఖు బాధ్యతలు చేపట్టనున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆయన పేరును ఖరారు చేసింది. డిప్యూటీ సిఎంగా ముఖేశ్ అగ్నిహోత్రి పేరును ఖరారు చేసిందని ఛత్తీస్‌గఢ్ సిఎం భూపేశ్ బఘేల్ తెలిపారు. వీరిద్దరూ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. వారితోపాటు మరికొందరు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. పిసిసి అధ్యక్షులు ప్రతిభాసింగ్, సుఖ్విందర్ సింగ్ సుఖు, ముఖేశ్ అగ్నిహోత్రి సిఎం పదవి కోసం ప్రయత్నించారు. చివరికి కాంగ్రెస్ హైకమాండ్ సుఖ్విందర్ సింగ్ పేరును ఖరారు చేసింది. మరో నేత ముఖేశ్ అగ్నిహోత్రికి డిప్యూటీ సిఎంగా బాధ్యతలు అప్పగించింది.

గుజరాత్ సిఎంగా 12న భూపేంద్ర ప్రమాణ స్వీకారం

అహ్మదాబాద్ : బిజెపి గుజరాత్ శాసనసభా పక్ష నేతగా భూపేంద్ర పటేల్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని గవర్నర్ దేవవ్రత్‌కు ఆయన తెలియజేశారు. సోమవారం ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పటేల్‌ను గవర్నర్ ఆహ్వానించారు. శనివారం ఉదయం జరిగిన బిజెపి శాసన సభాపక్ష సమావేశంలో భూపేంద్ర పటేల్ పేరును పార్టీ ఎమ్మెల్యే కనుదేశాయ్ ప్రతిపాదించగా, ముగ్గురు సీనియర్ ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చారు. భూపేంద్ర పటేల్ ఈ నెల 12వ తేదీన సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంత్రివర్గాన్ని ఖరారు చేసే అంశంపై ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్‌షాతో చర్చించేందుకు భూపేంద్ర పటేల్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పాటిల్ ఢిల్లీ వెళ్లారు.

నోబెల్ శాంతి బహుమతి ప్రదానం

ఓస్లో : నార్వేలోని ఓస్లోలో ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతులను విజేతలకు ప్రదానం చేశారు. బెలారస్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త అలెస్ బియాలియాట్స్‌కి తరపున ఆయన భార్య నటాలియా పిన్‌చుక్, రష్యన్ ఆర్గనైజేషన్ మెమోరియల్ అండ్ ఒలెక్సాండ్ర మట్విచుక్ తరపున జాన్ రాచిన్‌స్కీ, ఉక్రెయిన్ సంస్థ (సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్) తరపున ఒలగ్జాంద్ర మట్విచుక్ నోబెల్ శాంతి బహుమతులను శనివారం స్వీకరించారు. ఈ సందర్భంగా బహుమతి విజేతలు మాట్లాడుతూ రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఖండించారు.

పర్యావరణ సమన్యాయం పరిశీలన అవసరం

- మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ఉద్బోధ

న్యూఢిల్లీ : భీకరమైన వాతావరణ మార్పులు మన తలుపు తడుతున్నాయని, పేద దేశాల్లోని ప్రజలు ఈ పర్యావరణ క్షీణతకు భయంకరమైన మూల్యం చెల్లిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. పర్యావరణానికి సంబంధించి న్యాయమైన కోణాన్ని ఈ సమాజం పరిశీలించాల్సి వుందని ఆమె పేర్కొన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ప్రకృతిని, ఈ జీవ వైవిధ్యతను ఎలా గౌరవించాలో, దానితో ఎలా నడుచుకోవాలో మనం నేర్చుకోవాల్సి వుందని ఆమె కోరారు. ఒకవేళ జంతువులు, వృక్షాలకు మాటలు వస్తే అవి మనతో ఏం మాట్లాడతాయా అని ఆలోచన వస్తూ వుంటుందని అన్నారు. 'మానవ చరిత్ర గురించి నదులు ఏం మాట్లాడతాయి? తమ హక్కుల గురించి మన పశువులు ఏం చెబుతాయి, ఎందుకంటే సుదీర్ఘ కాలంగా మనం వాటి హక్కులను కాలరాస్తున్నాం. ఇప్పుడు ఆ ఫలితాలన్నీ మన కళ్ల ముందు కనిపిస్తున్నాయని' ఆమె వ్యాఖ్యానించారు. 'ప్రతి ఒక్క మనిషి సమానమే, ఎలాంటి తేడా లేదని మానవ హక్కుల భావన ఈ సమాజానికి ఉద్బోధిస్తోంది. జన జీవనంతో నిండిన ఈ ప్రపంచాన్ని, మనం గౌరవ ప్రపత్తులతో చూడాలి. ఇదేమీ నైతిక విధి కాదు, మన మనుగడ కోసం మనందరం గుర్తుంచుకోవాల్సిన అమూల్యమైన అంశమిదని' రాష్ట్రపతి స్పష్టం చేశారు. "అందరికీ గౌరవం, స్వేచ్ఛ, న్యాయం" అన్నది ఈ ఏడాది మానవ హక్కుల దినోత్సవం ప్రధాన అంశంగా వుందని, భారత రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న ఆదర్శాలకు ఇవి చాలా దగ్గరగా వున్నాయని ద్రౌపది ముర్ము అన్నారు.

తొమ్మిది వేల రోబోటిక్ కిట్ల పంపిణీ

తిరువనంతపురం : కేరళలో విద్యారంగ ఆధునీకరణలో భాగంగా రెండు వేల ఉన్నత పాఠశాలలకు తొమ్మిది వేల రోబోటిక్ కిట్లను పినరయి విజయన్ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం శుక్రవారం పంపిణీ చేసింది. తిరువనంతపురంలోని జిమ్మి జార్జి స్టేడియంలో ఈ కిట్లను సిఎం విజయన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ 12 లక్షల మంది విద్యార్థులకు రోబోటిక్ కిట్ల సహాయంతో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల వారికి సమానంగా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ పాఠశాల విద్యలో నాణ్యతను పెంచడం చాలా అవసరమని అన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ప్రభుత్వ విద్యారంగాన్ని మెరుగుపరిచే ప్రణాళికలు గత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నుంచి అమలులోకి వచ్చాయని తెలిపారు. దానికి కొనసాగింపుగా ప్రభుత్వ పాఠశాలల్లో రోబోటిక్ కిట్లు ఏర్పాటు చేసే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. లిటిల్ కైట్స్ పిల్లల ఐటి క్లబ్స్ తొమ్మిది వేల కిట్లను రూపొందించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి శివన్‌కుట్టి తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఆంధ్రా Andhra
కార్పొరేషన్ Corporation
బెంజ్ సర్కిల్ శాఖ,
సితార టవర్స్, యన్.సి.బి.యన్ కాలని,
విజయవాడ-520010. ఫోన్:0866-2496647.

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 54 / 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెంజ్ సర్కిల్ శాఖ** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు **తేది. 07-09-2022** న డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన బకాయి **రూ.21,13,186.80** పై (**అక్షరాల ఇరవై ఒక్క లక్షల పదమూడు వేల ఒక వంద ఎనభై ఆరు రూపాయల ఎనభై పైసలు మాత్రమే**) చెల్లించవలసినదిగా ఋణగ్రహీత మరియు హామీదారులను కోరియున్నారు. **1) షేక్ షబ్బీర్ అలీ,** తండ్రి: షేక్ అబ్దుల్ సత్తార్, **2) శ్రీమతి షేక్ ఆయేషా,** భర్త: షేక్ షబ్బీర్ అలీ, డి.నెం.8-75, ఆర్.టి.సి కాలని, శ్రీ చైతన్య స్కూల్ దగ్గర, కొత్తపేట, వేటపాలెం మండలం, ప్రకాశం జిల్లా-523157. **3) షేక్ షబ్బీర్ అలీ,** తండ్రి: షేక్ అబ్దుల్ సత్తార్, **4) శ్రీమతి షేక్ ఆయేషా,** భర్త: షేక్ షబ్బీర్ అలీ, ప్లాట్ నెం.23, 4వ లైన్, డి.నెం.4-147, లక్ష్మీ వినిత్ ఎన్‌క్లేవ్, ఈడుపుగల్లు గ్రామం, కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా-521151.

సదరు మొత్తాన్ని చెల్లించుటలో ఋణగ్రహీతల మరియు తనఖాదారు విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని దిగువ సంతకందారు **తేది. 09-12-2022** న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన యెడల అవి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,** వారికి బకాయి మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలకు బద్ధులై ఉంటారని ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

కృష్ణాజిల్లా-521151, కంకిపాడు మండలం, ఈడుపుగల్లు గ్రామం, ఆర్.యస్.నెం. 421/4, ప్లాట్ నెం.23, 4వ లైన్, లక్ష్మీ వినిత ఎన్‌క్లేవ్, 91.52 చ॥గ॥లు లేదా 76.52 చ॥మీ॥ల భూమి మరియు నివాస భవనం క్రింది అంతస్తు, ప్లింత్ ఏరియా 395.12 చ॥అ॥లలో గల శ్రీ షేక్ షబ్బీర్ అలీ & శ్రీమతి షేక్ ఆయేషా గారికి చెందిన ఆస్థి ఈ దిగువ హద్దులలో **తూర్పు:** కాంపౌండ్ గోడ, **దక్షిణం:** కాంపౌండ్ గోడ, **పడమర:** 40 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం.22.

తేది : 09-12-2022
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఢిల్లీలో కౌన్సిలర్ల కొనుగోలుకు బిజెపి యత్నం

- ఆప్ నేతల విమర్శ

న్యూఢిల్లీ : ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచిన కౌన్సిలర్లను కోట్లాది రూపాయలను ఎరచూపి బిజెపిలోకి లాక్కునేందుకు ప్రయత్నిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ విమర్శించారు. ఆప్ తరపున గెలిచిన డాక్టర్ రోనాక్షి శర్మ, అరుణ్ నవారియా, జ్యోతి రాణితోపాటు సింగ్ శనివారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సంజయ్‌సింగ్ మాట్లాడుతూ.. మహారాష్ట్ర, అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, గోవా, గుజరాత్ ఎమ్మెల్యేలను బిజెపి కొనుగోలు చేసిందని అన్నారు. అదేమాదిరి ఇప్పుడు ఢిల్లీ కౌన్సిలర్లను కొనేందుకు యత్నిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వారిని, ప్రజాతీర్పును డబ్బుతో అవహేళన చేస్తున్న వారిని అరెస్టు చేసి జైల్లో ఉంచాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ని కోరుతున్నానని అన్నారు. యోగేంద్ర చందోలియా తమ పార్టీ కౌన్సిలర్ శ్రీమతి శర్మకు ఫోన్ చేసి.. బిజెపి ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశ్‌కుమార్‌తో మాట్లాడించాలని ప్రయత్నిస్తున్నట్లు చెప్పారన్నారు. బిజెపి ఆపరేషన్‌లో భాగంగా 10 మంది కౌన్సిలర్లకు రూ.100 కోట్లు కేటాయించిందని సింగ్ దుయ్యబట్టారు.

మానవతా సాయంపై ఆంక్షలొద్దు

- భద్రతా మండలి తీర్మానం
- ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు

న్యూయార్క్ : ఆంక్షల బారి నుంచి మానవతాసాయాన్ని మినహాయించాలని కోరుతూ భద్రతా మండలి తీర్మానం చేసింది. ఈ తీర్మానంపై శుక్రవారం జరిగిన ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైంది. బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన తీవ్రవాద గ్రూపులు ఇటువంటి పరిస్థితులను పూర్తిగా అవకాశంగా తీసుకుంటాయని, నిధులను సేకరించి, తీవ్రవాదులను రిక్రూట్ చేసుకోవడానికి వారికి వెసులుబాటు వుంటుందని భారత్ పేర్కొంది. ప్రస్తుతం 15మంది సభ్యులు గల మండలికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. అమెరికా, ఐర్లాండ్ శుక్రవారం పెట్టిన ఈ తీర్మానంపై మండలిలో ఓటింగ్ జరిగింది. మానవతా చర్యలకు, కార్యకలాపాలకు మినహాయింపునిచ్చే పద్ధతిని ప్రవేశపెట్టాలని ఆ తీర్మానం కోరుతోంది. ఈ తీర్మానం ఆమోదిస్తే అనేకమంది అమాయకుల ప్రాణాలు కాపాడగలుగుతామని అమెరికా చెబుతోంది. ఈ తీర్మానానికి అనుకూలంగా మండలిలోని 14 దేశాలు ఓటు వేయగా, భారత్ ఒక్కటే గైర్హాజరైంది. మండలి అధ్యక్షురాలు, ఐక్యరాజ్య సమితిలో భారత్ శాశ్వత ప్రతినిధి రుచిరా కాంభోజ్ మాట్లాడుతూ, మానవతా సాయం కోసం ఇలాంటి వెసులుబాట్లు కల్పిస్తే తీవ్రవాదులు దాన్ని ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. ఆంక్షలు విధించిన ప్రభుత్వాలను అపహాస్యం చేస్తున్నారని పేర్కొంది. పాకిస్తాన్, అక్కడి తీవ్రవాద సంస్థల కార్యకలాపాలను పరోక్షంగా ప్రస్తావించారు.

ఎఐకెఎస్ జాతాలకు విశేష స్పందన

- ఎక్కడికక్కడ ఘన స్వాగతాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోరాటం, సంఘటితం, ప్రత్యామ్నాయంతో ముందుకు అనే సందేశాన్ని ప్రచారం చేస్తూ అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆధ్వర్యాన అమర వీరుల జ్యోతి యాత్రలు పలు రాష్ట్రాల మీదుగా ఉత్సాహంగా ముందుకు సాగుతున్నాయి. ఎఐకెఎస్ 35వ అఖిల భారత మహాసభ ఈనెల 13 నుంచి 16 వరకు కేరళలోని త్రిసూర్‌లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో వరుసగా తెలంగాణ, తమిళనాడులో ప్రారంభించిన రెండు అమరవీరుల జ్యోతి యాత్రలు (షహీద్ జ్యోతి యాత్రలు) ఈ నెల 8వ తేదీ రాత్రి సేలం చేరుకున్నాయి. సేలం జైలులో కిసాన్ ఉద్యమ నాయకులైన 22 మంది కమ్యూనిస్టులను 1950 ఫిబ్రవరి 11న పోలీసులు కాల్చి చంపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వేదిక, తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య గ్రామమైన కడవెండి నుంచి తొలి అమరవీరుల జ్యోతి యాత్ర బయలుదేరింది. ఎఐకెఎస్ నాయకులు పి. కృష్ణ ప్రసాద్ నాయకత్వంలో నిర్వహిస్తున్న ఈ యాత్రను ఎఐకెఎస్ ఉపాధ్యాయుడు ఎస్ మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ యాత్ర ఇప్పటివరకు గుండ్రాంపల్లి, మిరియాల్‌గూడ (నల్గొండ), గజరాం పల్లి (అనంతపూర్), పంపిడి, హోసూరు, బాగేపల్లి దాటి సేలం చేరుకుంది.

రెండో అమరవీరుల జ్యోతి యాత్ర తమిళనాడులోని కీజ్‌వెన్‌మణి నుంచి ప్రారంభమైంది. న్యాయమైన వేతనం, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడినందుకు అగ్రకుల భూస్వాములు, వారి గూండాలు 44 మంది వ్యవసాయ కూలీలను ఊచకోత కోశారు. ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి విజూ కృష్ణన్ నాయకత్వంలో నిర్వహిస్తున్న ఈ యాత్రను ఎఐకెఎస్ మాజీ అధ్యక్షుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమనేత ఎన్ శంకరయ్య 101 ఏళ్ల వయసులో ప్రారంభించారు. కార్మిక, కర్షక ఐక్యత బలోపేతం కావాలని, ప్రజా వ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ యాత్ర ఇప్పటివరకు తిరుతురైపూండి, గంధర్వక్కోట్టై, తంజావూరు, ఉలుందూర్‌పేట, తిరుచ్చి, కళ్లకురిచ్చి దాటి సేలం వద్ద కలుస్తుంది. ఈ రెండు యాత్రలకు ఎక్కడికక్కడ రైతులు, కార్మికులు, ప్రజానీకం ఉత్సాహంగా ఘన స్వాగతం పలుకుతున్నారు. ఈ నెల 6న బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఈ రెండు యాత్రల్లోనూ ఆయనకు నివాళు లర్పించారు. సేలంలో కార్ల్ మార్క్స్ విగ్రహానికి సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

వలయార్ వద్ద కేరళలో ప్రవేశించిన అమరవీరుల జ్యోతి యాత్ర

తమిళనాడు వివాసాయిగల్ సంఘం ఉపాధ్యక్షుడు డి రవీంద్రన్ నాయకత్వంలో సేలం వద్దకు మూడో అమరవీరుల జ్యోతి చేరింది. కేరళ కర్షక సంఘం అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయకత్వంలోని పున్నప్ర-వాయలార్ నుంచి ఫ్లాగ్ మార్చ్ ఈ నెల 9న ఎఐకెఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రామచంద్రన్ పిళ్లై ప్రారంభించారు. సమాంతరంగా, కేరళ కర్షక సంఘం కార్యదర్శి పనోలి వల్సన్ నాయకత్వంలో కయ్యూరు నుండి ఫ్లాగ్ పోల్ (జెండా స్తంభం) మార్చ్ ప్రారంభించారు. దీన్ని ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి ఇపి జయరాజన్ ప్రారంభించారు. పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచే మూడు జ్యోతులు, జెండా, ఫోల్ మార్చ్‌లు కేరళకు చేరుకున్నాయి. కేరళలోని వివిధ ప్రాంతాల మీదుగా మంగళవారం ఎఐకెఎస్ 35వ అఖిల భారత మహాసభకు ఆతిథ్యం ఇవ్వనున్న త్రిసూర్‌కు చేరుకుంటాయి.

వర్ష బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

సంఘటన చోటుచేసుకుంది. గోడ కూలి కొమ్ము పద్మావతి (43) అనే మహిళ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. చాపాడు, బ్రహ్మంగారిమఠం మండలాల్లో వరి పంట నేలకొరిగింది.

ప్రకాశంలో 3 వేల ఎకరాలకుపైగా పంట నష్టం

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం జిల్లాలో 3,190 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. శింగరాయకొండ, పొన్నలూరు, సంతనూతలపాడు మండలాల్లో పొగాకు 354 ఎకరాలు, మినుము 2836 ఎకరాల్లో నష్టం జరిగింది.

ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలి : చంద్రబాబు

మాండౌస్ తుఫాను తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. బాధితులకు అవసరమైన చర్యలు చేపట్టాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావంతో ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు తుఫాను సమాచారాన్ని ప్రజలకు చేరవేసి వారిని అప్రమత్తం చేయాలని కోరారు. అవసరం మేరకు వసతులతో సహాయ శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. తుఫాను ప్రభావంతో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ధాన్యం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులకు చేయూత అందించాలని కోరారు. రైతులను ఉదారంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. తడచిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. తుఫాను ప్రభావం ఉన్న ప్రాంతాల్లో టిడిపి నాయకులు, శ్రేణులు బాధితులకు అండగా నిలవాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో స్టాలిన్ పర్యటన

మాండూస్ తుపాను తమిళనాడులో బీభత్సం కలిగించింది. తమిళనాడు రాజధాని చెన్నైతోపాటు సముద్ర తీర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. దాంతో పలుచోట్ల భారీ వృక్షాలు నేలకూలాయి. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయి. తమిళనాడులో తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇప్పటికే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 98 పశువులు మృతి చెందాయి. 181 నివాసాలు దెబ్బతిన్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రమాద వివరాలను మీడియాకు తెలియజేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాలను ఆయన శనివారం పరిశీలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్న తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోవడంతో అంధకారం నెలకొన్నది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుపాను అల్పపీడనంగా బలహీనపడిందని, అయినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ తెలిపారు. తమిళనాడులో మరో రెండు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఆరు జిల్లాల్లోని 32 మండలాల్లో తుపాను తీవ్ర ప్రభావం చూపిందన్నారు. ప్రమాదకరమైన లోతట్టు ప్రాంతాల నుంచి 708 మందిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకి తరలించినట్లు చెప్పారు. 33 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసామని, 778 మందికి పునరావాసం కల్పించామని తెలిపారు. 1469 ఆహారపు ప్యాకెట్లు, 2495 వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

సముద్రంలో చిక్కుకున్నాం... కాపాడండి

- ఏడుగురు మత్స్యకారుల వినతి
- అధికారుల ఉరుకులు పరుగులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

'తుపాన్‌తో అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలో చిక్కుకుపోయాం. ఎలాగైనా కాపాడండి.' అంటూ ఏడుగురు మత్స్యకారులు చేసిన విజ్ఞప్తి అధికారులను పరుగులు పెట్టిస్తోంది. వారి దగ్గర నుండి ఆ ఫోన్ వచ్చినప్పటి నుండి అధికారయంత్రాంగం సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు చేసిన ప్రయత్నాలు శనివారం రాత్రి 10 గంటల వరకు ఫలితమివ్వలేదు. దీంతో ఏం జరగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. బాపట్ల జిల్లా, చీరాల వాడరేవుకు చెందిన ఏడుగురు మత్స్యకారులు ఈ నెల నాలుగో తేదీన బోటు తీసుకొని వేటకు వెళ్లారు. వారు సముద్రంలో ఉండగానే తుపాన్ వచ్చింది. బయటకు రావాలని ప్రయత్నించినప్పటికీ ఈదురుగాలులు, అలల తీవ్రతతో ఫలితం కనిపించలేదు. వీటికి తోడు వర్షం తీవ్రం కావడం, దగ్గర ఉన్న డీజిల్ అయిపోతుండటంతో పాటు బోటులోని ఒక ఇంజిన్‌కూడా చెడిపోయింది. దీంతో తీవ్ర ఆందోళన చెందిన వారు ఊళ్లపాలెం అనే గ్రామంలోని ఒక వ్యక్తికి ఫోన్ చేసి సమాచారం అందించారు. తమను కాపాడాలని కోరారు. ఆ గ్రామస్తులు ఈ సమాచారాన్ని అధికారులకు తెలియచేశారు. దీంతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. వారిని రక్షించేందుకు మెరైన్ పోలీసులు, అటు నిజాంపట్నం, ఇటు కృష్ణపట్నం కోస్ట్ గార్డు సిబ్బంది రంగంలోకి దిగారు. అయితే, శనివారం రాత్రి వరకు వీరు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఆంధ్రా Andhra
కార్పొరేషన్ Corporation
బెంజ్ సర్కిల్ శాఖ,
సితార టవర్స్, యన్.సి.బి.యన్ కాలని,
విజయవాడ-520010. ఫోన్:0866-2496647.

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 54 / 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెంజ్ సర్కిల్ శాఖ** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు **తేది. 07-09-2022** న డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన బకాయి **రూ.9,04,996.03** పై (**అక్షరాల తొమ్మిది లక్షల నాలుగు వేల తొమ్మిది వందల తొంభై ఆరు రూపాయల మూడు పైసలు మాత్రమే**) చెల్లించవలసినదిగా ఋణగ్రహీత మరియు హామీదారులను కోరియున్నారు. **1) శ్రీమతి సుంకర పుష్పలత,** భర్త: సుంకర శ్రీనివాస్, **2) శ్రీ సుంకర శ్రీనివాస్,** తండ్రి: యస్. వీరభద్రరావు, ఫ్లాట్ నెం.311, 2వ అంతస్తు, రామ్స్ స్నేహ ఎవెన్యూ, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా-522501.

సదరు మొత్తాన్ని చెల్లించుటలో ఋణగ్రహీతల మరియు తనఖాదారు విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని దిగువ సంతకందారు **తేది. 09-12-2022** న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన యెడల అవి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,** వారికి బకాయి మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలకు బద్ధులై ఉంటారని ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

షెడ్యూల్-ఏ: గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రరి ఏరియా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామపంచాయతి ఏరియా, కుంచనపల్లి గ్రామం, ఆర్.యస్.నెం.9/3 & 9/2, దగ్గరి డోర్.నెం.3-271 లో 3146.4 చ॥గ॥లు లేదా 2630.79 చ॥మీ॥లు ఈ దిగువ హద్దులలో **తూర్పు:** ఉమ్మడి దారి & కల్లం అంజిరెడ్డి & ఇతరులు, **దక్షిణం:** గోర్ల సుబ్బారెడ్డి గారి ఆస్తి, **పడమర:** రోడ్డు & రెడ్డి బత్తుల ఈశ్వర్ రెడ్డి & ఇతరుల ఆస్థి, **ఉత్తరం:** దేవభక్తుని హర్షవర్ధనరావు గారి ఆస్థి & ఇతరుల ఆస్థి. పై నాలుగు సరిహద్దులలో మొత్తం 3146.4 చ॥గ॥లు లేదా 2630.79 చ॥మీ॥లలో 30 చ॥గ॥లు లేదా 25.08 చ॥మీ॥ల అవిభాజ్యపు స్థలం. **షెడ్యూల్-బి:** వైడ్ సేల్ డీడ్.నెం.8774/2012, తేది: 04-10-2012 ప్రకారం: యస్.ఆర్.ఓ మంగళగిరి, పై ఏ-షెడ్యూల్ ఆస్థిలో రామ్స్ స్నేహ ఎన్‌క్లేవ్, 2వ అంతస్తులో ఫ్లాట్ నెం.311 (2 బెడ్‌రూమ్) నివాస ఫ్లాట్ శ్రీమతి సుంకర పుష్పలత & సుంకర శ్రీనివాసరావు గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** ఫ్లాట్ నెం.312 కట్టుబడి ఓపెన్ టూ స్కై, **దక్షిణం:** కారిడార్ & ఓపెన్ టూ స్కై, **పడమర:** ఫ్లాట్ నెం.310 కట్టుబడి కారిడార్, **ఉత్తరం:** ఓపెన్ టూ స్కై. పైన నాలుగు సరిహద్దుల మధ్య ప్లింత్ ఏరియా 876 అ॥లు, కామన్ ఏరియా 256 అ॥లు మరియు అట్చాడ్ బాత్ రూమ్ & లాట్రిన్ మరియు క్రింది అంతస్తులో 100 చ॥అ॥లలో ఫోర్ వీలర్ పార్కింగ్ మరియు ఉమ్మడి వినియోగంతో కామన్ ఏరియా & సాధారణ సౌకర్యాలలో హక్కులు రామ్స్ స్నేహ అవెన్యూ మరియు కొనుగోలుదారుకు చెందినవి, నిర్వహణ మరియు మరమ్మత్తు ఛార్జీలలో అతని/ఆమె వాటాను భరించవలెను.

తేది : 09-12-2022
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మీకోసం

యాలకులు, లవంగాలు, దాల్చినచెక్క.. లాంటి సువాసన వెదజల్లే మసాలా దినుసులను నీటిలో వేసి బాగా వేడిచేయాలి. ఇలా చేస్తే వంటగదిలో సువాసనలు వ్యాపిస్తాయి.

జీవన సౌరభం

మీ చుట్టూ ఎలాంటి పరిస్థితులు ఉన్నా మీ సమగ్రతను కాపాడుకోవడం ఎల్లప్పుడూ సాధ్యమే!

పిల్లల మనసు



ఒక నక్క కుందేలును తినాలని ఎత్తువేసింది. అది కుందేలు బొరియ వద్దకు వెళ్లి చచ్చినట్లు పడుకుంది. అప్పుడే బయటకు వచ్చిన కుందేలు దూరంగా నిలబడి నక్కను చూచి 'అయ్యో పాపం! నక్క చనిపోయినట్లు ఉంది!' అని పైకి అంది. దాని మాటలు విన్న నక్క తన పథకం ఫలిస్తున్నందుకు సంతోషించింది. అది తన దగ్గరకు రాగానే పట్టుకుందామని అనుకుంది.

ఇంతలో నక్క పిల్లలు అక్కడకు రాసాగాయి. దూరంగా ఉండి చూసిన కుందేలు చెట్టు చాటుకు వెళ్లింది. ఇది గమనించని నక్క పిల్లలు 'అమ్మా... అమ్మా! ఆకలేస్తుంది.' అంటూ వచ్చాయి. అవి తల్లితో 'అమ్మా! కుందేలును పట్టుకుని తొందరగా వస్తానని ఇంతసేపు రానేలేదు. నీ కోసం ఎంతసేపు ఎదురు చూడాలి' అని అమాయకంగా అడిగాయి. నక్క మాత్రం నిద్రపోయినట్లు నటిస్తూనే ఉంది.

అప్పుడు కుందేలుకు నక్క పన్నాగం అర్థం అయింది. అది తనను పట్టుకోవటానికే చనిపోయినట్లు నాటకం ఆడుతున్నదని తెలిసింది. నక్కకు బుద్ధి చెప్పాలనుకుంది. దూరం నుంచే నక్క పిల్లలకు 'మీ అమ్మ చనిపోయింది' అని చెప్పింది.

అప్పుడు దాని పిల్లలు 'కుందేలు మామా! జంతువులు వేటాడేటప్పుడు చచ్చినట్లు పడుకుంటానని మా అమ్మ మాకు చెప్పింది. మా అమ్మకు ఏమీ కాలేదు.' అన్నాయి.

ఆ మాటలు విన్న తల్లి నక్క లేచి కోపంతో 'అసలు మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు? నా పథకమంతా పాడుచేశారు' అని కసురుకుంది.

అప్పుడు కుందేలు 'నక్క మామా! ఎందుకలా పాపం పిల్లల్నీ కసరుతావు? పిల్లల మనసు కల్లా కపటం లేనిది. వారికి అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం రాదు.' అంది. ఆ మాటలకు నక్క సిగ్గుపడి తన పిల్లలతో అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
99085 54535



బొమ్మ గీయండి!

చిన్నారులూ, ఈ రోజు తాబేలు బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెల ఆధారంగా బొమ్మ గీయండి.

నేను గీసిన బొమ్మ

- బి. చందన,
8వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.
గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అడవే ఆలంబనగా ...

ఎటు చూసినా కొండలు, భీతిగొలిపే లోయలు, కనుచూపు మేరా పచ్చదనం. పులుల గాండ్రింపులు, పక్షుల కిలకిలరావాలు. సాయంత్రమైతే వర్షపు చినుకులు, విషసర్పాలు కళ్లముందే పాకుతున్నా భయమనేది తెలియని జీవనం. కొండ కోనలే ఆవాసాలు, అడవిలో దొరికే ఆకులు, బెరడుల నుంచి భూమిలో సహజ సిద్ధంగా లభ్యమయ్యే దుంపలు, ప్రకృతి వరప్రసాదిని పుట్టతేనె చేసి తదితరాలే గిరిపుత్రుల ఆదాయ వనరులు. ఐతే వీరిని గిరిజన సహకార సంస్థ సైతం మోసం చేస్తోంది. అడవే ఆలంబనంగా జీవనం సాగిస్తున్న వీరిని జీవన పలకరించింది.

ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాల్లో విస్తరించి ఉన్న దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో ఏడు మండలాల్లో 81 చెంచు గూడేల్లో 15 వేల మందికిపైగా గిరిజనులు నివాసం ఉంటున్నారు. వీరిలో చాలామంది అటవీ

ఉత్పత్తులపై జీవనం సాగిస్తున్నారు. ఏటా ఆరు నెలల పాటు అడవిలో దొరికే వివిధ రకాల ఫలాలు, పంట ఉత్పత్తులను సేకరిస్తారు. జీసీసీలో లేదా దోర్నాల, ఆత్మకూరు, దోర్నాల-శ్రీశైలం మధ్య యాత్రికులకు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రకృతి నుంచి సహజ సిద్ధంగా లభ్యమవుతున్న అటవీ ఉత్పత్తులంటే అందరూ ఇష్టపడతారు. కుటుంబంలో పెద్దలతో పాటు పిల్లలూ కష్టపడుతూ శ్రమైక జీవనం సాగిస్తున్నారు.

గిరిజన సహకార సంస్థ ద్వారా అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేస్తూ అటవీ బిడ్డలకు అండగా నిలవాల్సిపోయి వారి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని తక్కువ ధరలు నిర్ణయించి ఇబ్బందులకు గురిచేస్తోంది.

దరి చేరని సంక్షేమం

ఆధునిక పోకడలకు దూరంగా ఉంటున్న చెంచులకు అడవే అన్నీ. అభివృద్ధికి నోచుకుని వీరికి సంక్షేమ పథకాలూ అందడం లేదు. రోజూ అన్నం తినాలంటే కుటుంబంలో అందరూ కష్టపడాల్సిందే. నిత్యావసరాల కోసం పట్టణం వెళ్లాలన్నా రహదారి సౌకర్యాలు సరిగ్గా లేవు. ఎప్పుడో పాతికేళ్ల నాడు నిర్మించిన పక్కా ఇళ్లు ఎప్పుడు కూలతాయో అని బిక్కుబిక్కుమంటూ వాటిలోనే తలదాచుకుంటున్నారు. ఎక్కువమంది పూరి గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారు. చీకటి పడితే విషజంతువుల భయంతో బయటకు రారు. సరియైన వైద్య సేవలు అందడం లేదు. ఆకుపసర్లపై ఆధారపడుతున్నారు. ముఖ్యంగా మలేరియా, క్షయ, రక్తహీనత వ్యాధులతో చెంచులు పండుటాకుల్లా రాలిపోతున్నారు.

చదువుకు దూరంగా ...

చెంచు గిరిజనుల కోసం ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు గూడేలకు దూరంగా ఉన్నాయి. అంతదూరం నడిచి వెళ్లలేక చాలా మంది పిల్లలు స్కూళ్లకు వెళ్లడం లేదు. ప్రాథమిక విద్యలోనే చదువులు ఆపేస్తున్నారు. గొడ్డలి భుజాన పెట్టుకుని తల్లిదండ్రులతో అడవి బాట పడుతున్నారు.

స్వచ్ఛమైన ప్రకృతి పదార్థాలు

భ్రమరాంబ చెంచుకాలనీ, గూడేల్లో నివసించే గిరిజనులు ఏటా జనవరి నుంచి ఏప్రిల్ వరకు పాలగడ్డ, తేనె, ఉసిరి, కుంకుడు కాయలు, కరక్కాయలు, విస్తరాకులు సేకరించి జీసీసీలో లేదా గ్రామాలకు వెళ్లి విక్రయిస్తుంటారు. శ్రీశైలం, మహానంది వైపు వెళ్లే ప్రయాణికులు, యాత్రికులు రోడ్డు వెంట వీరు విక్రయించే ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. ఎరువులు, రసాయనిక మందులు వేయని, సహజ సిద్ధంగా పండినవి కావడంతో వీటిని అందరూ కొనుగోలు చేస్తుంటారు. కొన్ని ఉత్పత్తులు ఆయుర్వేద మందుల్లో ఉపయోగిస్తారు.

తేళ్లు, జెర్రులున్నా..

జనవరి నుంచి అడవిలోకి వెళ్లి పాలగడ్డలు సేకరిస్తారు. భూమి తవ్వేటప్పుడు అందులో తేళ్లు, జెర్రులు ఉంటాయి. అయినా పొట్టకూటి కోసం ధైర్యంగా ముందుకు వెళతారు. విష పురుగులను తప్పించి, గడ్డలు తెచ్చి ఒకరోజంతా నీటిలో నానబెడతారు. మరో నాలుగు గంటలు వేడి నీటిలో ఉడకబెడతారు. తర్వాత గడ్డల నుంచి రసం తీసి, ఇందులో కొద్దిగా బెల్లం పాకం వేసి నన్నారి తయారు చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తి కావటానికి నాలుగు, ఐదు రోజులు పడుతుంది. దీన్ని బాటిళ్లలో నింపి రూ.150 చొప్పున అమ్ముతారు. సహజసిద్ధంగా లభిస్తుందని, తాగితే ఆరోగ్యంగా ఉంటుందని విక్రయదారులు ఇష్టంగా కొనుగోలు చేస్తారు.

- షేక్ వలీసాహెబ్
యర్రగొండపాలెం విలేకరి

చెట్లు ఎక్కి ...

అక్టోబర్ - ఏప్రిల్ నెలల మధ్య తేనె టీగలు పెద్ద పెద్ద చెట్లుకు తేనెతుట్టెలు పెడతాయి. వాటిని మగవాళ్లు వెళ్లి జాగ్రత్తగా సేకరిస్తారు. వాళ్లతో మేము వెళతాం. ఒక్కోసారి చెట్లు ఎక్కేటప్పుడు కాలు జారిపడిన పడతారు. అయినా మేము తేనె సేకరించడం ఆపం. అడవిని నమ్ముకుని బతుకుతున్నాం. ప్రమాదాలు పొంచి ఉన్నా మా బతుకు పోరాటం సాగుతూనే ఉంటుంది.

- భూమని అంకమ్మ, బిళ్లగొందిపెంట.

వెలగపండ్లు అమ్ముకుని ...

ఆభయారణ్యంలో మార్చి నుంచి ఆగస్టు వరకు వెలగపండ్లు ఎక్కువగా లభ్యమవుతాయి. గతంలో పండ్లు దొరకాలంటే ఎంతో కష్టంగా ఉండేది. అటవీ శాఖ అధికారుల చర్యలతో ఆయా సీజన్లలో పండ్లు లభ్యమవుతున్నాయి. అడవిలోకి ఇతరులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవడం వల్ల ఈ పండ్లు దొరుకుతున్నాయి. యాత్రికులు ఎక్కువగా వెలగపండ్లను ఇష్టపడతారు. అవి అమ్మగా వచ్చిన డబ్బుతోనే ఇల్లు గడుస్తుంది.

- భూమని వీరమ్మ, తుమ్మలబైలు.

తాగేందుకు నీరు లేదు

గిరిజనులను ఉద్ధరిస్తామని అధికారులు చెబుతున్నా...వీరికి ఏ అభివృద్ధి పథకాలు అందడం లేదు. చెంచులు ఐటిడిఏకు వెళ్లి అక్కడ తమ సమస్యలు చెప్పుకునే పరిస్థితి లేదు. చాలా గూడేల్లో ఇంకా చలమల్లోని నీరు తెచ్చుకొని తాగాల్సిన పరిస్థితి ఉంది.

- భూమని వెంకటేశం, ఐటీడీఏ ప్రెసిడెంట్, వెంకటలక్ష్మిగూడెం

జనవరిలో 'ఎస్ఎస్ఎంబీ28' సెకండ్

మహేశ్ బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ డైరెక్షన్‌లో రూపొందుతున్న 'ఎస్ఎస్ఎంబీ28' చిత్రం మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుని త్వరలోనే రెండో షెడ్యూల్ ప్రారంభించనుంది. జనవరిలో ఈ సినిమా రెండో షెడ్యూల్ ప్రారంభించనున్నట్లు మేకర్స్ తెలిపారు. మూవీ టీంతో కలిసి మహేశ్‌బాబు క్రిస్మస్ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్న ఫొటోలు కూడా తాజాగా విడుదలయ్యాయి. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు.

రజినీ సినిమా ఉత్సవం..

రజనీకాంత్ పుట్టినరోజును పురస్కరించుకుని, భారతదేశంలో అతిపెద్ద థియేటర్స్ చైన్ పివిఆర్ సినిమాస్ డిసెంబర్ 9 నుండి 15 వరకు చెన్నై, కోయంబత్తూరులో ఎంపిక చేసిన థియేటర్లలో ప్రత్యేక ఈవెంట్‌ను నిర్వహిస్తోంది. 'రజనీకాంత్ బర్త్‌డే స్పెషల్ ఫిల్మ్ ఫెస్టివల్' పేరుతో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ఆయన నటించిన సినిమాలను ప్రదర్శిస్తున్నారు. 7 రోజుల ఫెస్టివల్‌లో 4 సూపర్‌హిట్ చిత్రాలు 'బాబా (2002), శివాజీ : ది బాస్ (2007), 2.0 (2018), దర్బార్ (2020)'ను ప్రదర్శిస్తున్నారు.

రవితేజ కోసమే రాసిన కథ ఇది..

రవితేజ, దర్శకుడు త్రినాథరావు నక్కిన కాంబోలో రాబోతున్న చిత్రం 'ధమాకా'. హీరోయిన్‌గా శ్రీలీల నటిస్తున్నారు. టిజి విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అండ్ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై రూపొందుతున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. డిసెంబర్ 23న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించిన ప్రసన్న కుమార్ బెజవాడ చిత్ర విశేషాలని పంచుకున్నారు.

లాక్ డౌన్‌కి ముందు 'ధమాకా' కథ చెప్పాను. లాక్ డౌన్‌లోనే స్క్రిప్ట్ వర్క్ అంతా కంప్లీట్ చేశాం. రవితేజ గారిని దృష్టిలో పెట్టుకొని ఆయన కోసమే రాసుకున్న కథ ఇది. ఆయన నుండి వరుసగా సీరియస్ సినిమాలు వస్తున్నాయి. రవితేజ గారి బలం ఎంటర్ టైన్ మెంట్. మా బలం కూడా అదే. ఇద్దరం కలసి మంచి ఎంటర్ టైనర్ చేయాలని 'ధమాకా' చేశాం. 'రౌడీ అల్లుడి'కి మరో వెర్షన్‌లా ఈ సినిమా ఉంటుంది. ఇందులో రావు రమేష్, హైపర్ ఆది కాంబినేషన్‌లో కామెడీ బాగా వచ్చింది. అలీ గారి పాత్ర కూడా బావుంటుంది. ఇంటర్వెల్‌కి ముందు వచ్చే ఐదు నిమిషాల ఎపిసోడ్ సినిమా రేంజ్‌ని డిసైడ్ చేసే ఎంటర్ టైన్ మెంట్ సీక్వెన్స్. హిందీలో 'బిగ్ ధమాకా' పేరుతో ఈ చిత్రాన్ని అక్కడ విడుదల చేస్తున్నాం.

విక్రమ్ కొత్త లుక్

పా రంజిత్ దర్శకత్వంలో ప్రస్తుతం విక్రమ్ నటిస్తున్న 'తంగాలాన్' సినిమా నుండి విక్రమ్ మేకప్ స్టిల్స్ ఫొటోలు విడుదలయ్యాయి. పొడవాటి జుట్టు, గడ్డంతో పాటు మొహం కూడా నల్ల రంగుతో మేకప్ చేశారు. చిత్ర యూనిట్ సభ్యులు విడుదల చేసిన ఈ వర్కింగ్ స్టిల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

దిల్‌రాజుకు సురేష్‌బాబు మద్దతు

సంక్రాంతి సినిమాల విడుదల విషయంలో నిర్మాత సురేష్‌బాబు, నిర్మాత దిల్‌రాజుకు మద్దతు పలికారు. నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్‌గా తనకున్న వెసులుబాటు ప్రకారం దిల్‌రాజు తన చిత్రాన్ని విడుదల చేసుకుంటున్నట్లు తెలిపారు. బాషా ప్రాతిపదిక కాకుండా చివరకు మంచి సినిమానే మాట్లాడుతుందని, సంక్రాంతికి అన్ని సినిమాలు విడుదలై విజయం సాధిస్తాయని సురేష్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. డిసెంబర్ 13న వెంకటేశ్ పుట్టిన రోజు సందర్భంగా 'నారప్ప' చిత్రాన్ని థియేటర్లల్లో విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఒక రోజు విడుదలకు అనుమతి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన డబ్బును సమాజసేవకు వినియోగిస్తామన్నారు.

తునివు ఫస్ట్ సింగిల్

తమిళ స్టార్ అజిత్ కుమార్ 'తునివు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ప్రమోషన్లో భాగంగా చిత్రంలోని 'చిల్లా చిల్లా' సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. జిబ్రాన్ కంపోజింగ్, అనిరుధ్ గాత్రం ఫ్యాన్స్‌ను ఉత్సాహపరుస్తుంది. ఇప్పటివరకు ఈ సాంగ్ 82లక్షల వ్యూస్ సాధించింది. ఇక యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో అజిత్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం తమిళంతో పాటు తెలుగులోనూ రిలీజ్ కానుంది. త్వరలోనే చిత్రబృందం తెలుగు డబ్బింగ్ పనులు స్టార్ట్ చేయనున్నట్లు తెలుస్తుంది. తెలుగులో ఈ మూవీ 'తెగింపు' పేరుతో రిలీజ్ కానుంది.

అద్భుత హెడ్డర్ ద్వారా గోల్ చేస్తున్న మొరాకో ఆటగాడు యూసెఫ్

గోల్ కొట్టిన అర్జెంటీనా ఆటగాడు మెస్సీ

మొరాకో తొలిసారి

క్వార్టర్స్‌లో పోర్చుగల్‌పై సంచలన విజయం

దోహా: ఫిఫా ప్రపంచకప్-2022 సెమీఫైనల్లోకి మొరాకో జట్టు తొలిసారి ప్రవేశించింది. శనివారం జరిగిన మూడో క్వార్టర్‌ఫైనల్లో మొరాకో జట్టు 1-0తో ఫేవరెట్ పోర్చుగల్ జట్టును ఓడించింది. చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోటీలో మొరాకో జట్టు టైటిల్ ఫేవరెట్ పోర్చుగల్‌పై పైచేయి సాధించింది. మొరాకో తరఫున ఏకైక గోల్‌ను యూసెఫ్ అద్భుత హెడ్డర్ ద్వారా చేశాడు. ఈ మ్యాచ్‌లో పోర్చుగల్ స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో 70నిమిషాల ఆటవరకు బెంచ్‌కే పరిమితం కావడం విశేషం. అలాగే మొరాకో స్టార్ ఆటగాడు వాలిద్ చెడ్రా 93వ నిమిషంలో రెడ్‌కార్డుకు గురై మైదానాన్ని వీడితే మిగిలిన 7 నిమిషాల ఆట ముగిసేవరకు ఆ జట్టు 10మంది ఆటగాళ్లతోనే ఆడింది. ఆ జట్టు అద్భుతమైన డిఫెన్స్‌తో ఆకట్టుకొని సంచలన విజయం సాధించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఫిఫా ప్రపంచకప్‌లో మొరాకో జట్టు అత్యుత్తమ ప్రదర్శన 1986లో గ్రూప్ స్టేజ్ దాటి తొలిసారి ప్రి క్వార్టర్స్ వరకు చేరడమే. ఇంగ్లండ్-ఫ్రాన్స్ జట్ల మధ్య జరిగే నాల్గో క్వార్టర్‌ఫైనల్ విజేతతో 15న మొరాకో జట్టు సెమీస్‌లో తలపడనుంది.

ఉత్కంఠపోటీలో అర్జెంటీనా గెలుపు..

శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్లో అర్జెంటీనా జట్టు పెనాల్టీ షూటౌట్‌లో 4-3గోల్స్ తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. రెండు అర్ధభాగాల సమయంతోపాటు, అదనపు సమయం ముగిసేసరికి ఇరుజట్లు 2-2గోల్స్‌తో సమంగా నిలిచాయి. అర్జెంటీనా తరఫున నెహుల్ మోలినా(35వ ని.), మెస్సీ(73వ ని.) పెనాల్టీని గోల్స్‌గా మలిచారు. ఇక నెదర్లాండ్స్ తరఫున వాట్(83వ ని.) ఒక గోల్ కొట్టినా.. మ్యాచ్ ముగియడానికి కొద్ది సెకన్ల ముందు వాట్ మరో గోల్ కొట్టి అర్జెంటీనాతో స్కోర్‌ను సమం చేశాడు. ఇక పెనాల్టీ కిక్స్‌లో నెదర్లాండ్స్ జట్టు 3 గోల్స్ కొడితే.. అర్జెంటీనా జట్టు 4 గోల్స్ కొట్టి గెలిచింది. బుధవారం జరిగే సెమీస్‌లో అర్జెంటీనా జట్టు క్రొయేషియాతో తలపడనుంది.

ఇషాన్ 210, కోహ్లి 113

మూడో వన్డేలో 227 పరుగుల తేడాతో బంగ్లాపై గెలుపు

చిట్టగాంగ్(బంగ్లాదేశ్): తొలి రెండు వన్డేల్లో ఓడి సిరీస్‌ను కోల్పోయిన టీమిండియా.. మూడో వన్డేలో ఏకంగా 227 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ వికెట్‌ను త్వరగా కోల్పోయింది. ఆ తర్వాత యువ ఓపెనర్ ఇషాన్ కిషన్(210) వీరోచితంగా బ్యాటింగ్ చేసి కెరీర్‌లో తొలి డబుల్ సెంచరీ సాధించాడు. మరో ఎండ్‌లో కోహ్లి(113) కూడా సెంచరీతో కదం తొక్కాడు. వీరిద్దరూ కలిసి 2వ వికెట్‌కు ఏకంగా 290 పరుగులు జతచేశారు. కోహ్లికి వన్డేల్లో ఇది 44వ సెంచరీ కాగా.. అన్ని ఫార్మాట్లలో కలిపి 72వ శతకం. ఇక ఇషాన్ 131బంతుల్లో 210 పరుగులు చేసి పలు రికార్డులను నెలకొల్పాడు. చివర్లో అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లు బ్యాట్ ఝుళిపించడంతో టీమిండియా 50 ఓవర్లకు 8వికెట్ల నష్టానికి 409పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. బంగ్లా బౌలర్లలో తస్కిన్ అహ్మద్, ఇబాదత్ హొస్సేన్, షకిబుల్ హసన్‌కు రెండేసి, ముస్తాఫిజుర్, మెహదీకి చెరో వికెట్ లభించాయి.

భారీ ఛేదనతో నాలుగో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన బంగ్లాకు అక్షర్ పటేల్ తొలి బ్రేక్ ఇచ్చాడు. కెప్టెన్ లిట్టన్ దాస్(29)ను సిరాజ్ ఔట్ చేయగా.. మిడిలార్డర్ బ్యాటర్ షకిబుల్, ముష్ఫికర్ రహీంలు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, షకిబుల్(43)కు మిగతా బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. భారత బౌలర్లు వరుసగా వికెట్లు తీయడంతో బంగ్లా ఒత్తిడిలో పడింది. శార్దూల్ ఠాకూర్ కీలకమైన మెహిదీ హసన్ వికెట్ తీయడంతో బంగ్లా ఓటమి ఖాయమైంది. భారత బౌలర్లలో శార్దూల్ ఠాకూర్‌కు మూడు, అక్షర్ పటేల్, ఉమ్రాన్ మాలిక్‌కు రెండేసి, సిరాజ్, కుల్దీప్, వాషింగ్టన్ సుందర్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను బంగ్లాదేశ్ జట్టు 2-1తో చేజిక్కించుకోగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఇషాన్ కిషన్‌కు, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ మెహిదీ హసన్‌కు లభించాయి.

ముగిసిన ప్రొ కబడ్డీ లీగ్ పోటీలు

సెమీస్‌కు జైపూర్, పుణేరి 13న ప్లే-ఆఫ్స్

హైదరాబాద్: పట్నా పైరెట్స్-బెంగాల్ వారియర్స్ జట్ల మధ్య శనివారం జరిగిన మ్యాచ్‌తో ప్రొ కబడ్డీ సీజన్-9 లీగ్ పోటీలు ముగిసాయి. 12 జట్ల మధ్య 10వారాల పాటు సాగిన లీగ్ పోటీల అనంతరం జైపూర్ పింక్ ప్యాంథర్స్ జట్టు 15విజయాలతో, పుణేరి 14 విజయాలతో టాప్-2లో నిలిచి సెమీస్‌కు చేరాయి. 13 మంగళవారం జరిగే ప్లే-ఆఫ్స్ విజేత సెమీస్‌లో జైపూర్, పుణేరిలతో తలపడనున్నాయి. 15న సెమీఫైనల్స్, 17న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. నేటి తొలి మ్యాచ్‌లో యు ముంబ జట్టు 36-30పాయింట్ల తేడాతో బెంగళూరును మరో మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ జట్టు 61-38పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌ను చిత్తుచేసింది. ఇక పట్నా జట్టు 49-38పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌ను చిత్తుచేసింది. తెలుగు టైటాన్స్ జట్టు 22 మ్యాచుల్లో కేవలం 2 మ్యాచుల్లో మాత్రమే గెలిచి 20 మ్యాచుల్లో ఓడింది.

ప్లే-ఆఫ్స్..
బెంగళూరు బుల్స్ × దబాంగ్ ఢిల్లీ
యుపి యోధా × తమిళ్ తలైవాస్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68